PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 108, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, సోమవారం - 08 - జూన్ - 2026 , వెల రూ.5/-

## మోదీ ఇచ్చిన వజ్రాన్ని సొంతం చేసుకోలేకపోయిన జిల్ బైడెన్..
## ఆత్మకథలో ఆసక్తికర విషయాల వెల్లడి

- ప్రధాని మోదీ బహూకరించిన ల్యాబ్-గ్రోన్ వజ్రంపై జిల్ బైడెన్ ఆసక్తి
- యూఎస్ నిబంధనల ప్రకారం వజ్రం ప్రభుత్వ సొత్తుగా గుర్తింపు
- మోదీ చెప్పిన ధర కంటే అమెరికా అధికారులు కట్టిన విలువే ఎక్కువ
- ధర భారీగా ఉండటంతో సొంతం చేసుకోలేకపోయిన మాజీ ఫస్ట్ లేడీ
- అధికారిక ఈవెంట్లలో ధరించి, వైట్ హౌస్ వీడాక తిరిగి ప్రభుత్వానికి అప్పగింత



ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ గతంలో తనకు బహూకరించిన ఒక అరుదైన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని అనుకున్నానని, కానీ అమెరికా ప్రభుత్వ నిబంధనలు, దాని భారీ విలువల కారణంగా చివరికి దానిని వెనక్కి ఇచ్చేయాల్సి వచ్చిందని అమెరికా మాజీ ఫస్ట్ లేడీ డాక్టర్ జిల్ బైడెన్ వెల్లడించారు. ఈ వారం మార్కెట్లోకి విడుదలైన ఆమె ఆత్మకథ 'వ్యూ ఫ్రమ్ ద ఈస్ట్ వింగ్: ఎ మెమోయిర్' పుస్తకంలో వైట్ హౌస్ జీవితం, విదేశీ పర్యటనల్లో వచ్చే బహుమతులపై ఉండే కఠినమైన నిబంధనల గురించి ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

# ఏపీలో రేర్ ఎర్త్ హబ్..
# రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ

- మాస్కోలో రష్యా రేర్ ఎర్త్ సంస్థ 'గిరెడ్‌మెట్'తో మంత్రి నారా లోకేష్ భేటీ
- ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ల తయారీ కేంద్రంపై చర్చలు
- భారత ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లే లక్ష్యంగా ప్రాజెక్టులు
- మాస్కోలోని అణుశక్తి మ్యూజియాన్ని సందర్శించిన లోకేష్



అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ 'గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో లభించే భారీ ఖనిజ వనరులను ఉపయోగించుకుని, ఒక డీప్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. అలాగే, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పవన విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేందుకు గిరెడ్‌మెట్ సాంకేతికతతో నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి

## రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా
- మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ
- తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి
- బెంగళూరులో రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా పోస్ట్



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో

## పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం..
## ఉమ్మడి నెల్లూరు జిల్లా కమిటీల రద్దు



అమరావతి, : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పార్టీ నాయకత్వంలో క్రమశిక్షణ లోపించడం, పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

## కూటమి ప్రభుత్వానికి ఏపీజేఏసీ హెచ్చరిక.. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే!



- ప్రభుత్వ ఉద్యోగుల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- మధ్యంతర భృతి, కొత్త పీఆర్సీ అమలుపై ప్రభుత్వం స్పందించాలని సూచన
- డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమానికి సిద్ధమని ఏపీ జేఏసీ హెచ్చరిక

## విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలు కావద్దు..
## భారత యువతకు నితిన్ నబిన్ పిలుపు!



- భారతీయ యువత ఎవరి మాటలకు లొంగబోదన్న నితిన్ నబిన్
- యవతను ప్రభావితం చేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శలు
- దేశ పురోగతి యువత కష్టపడే తత్వంపైనే ఆధారపడి ఉందన్న బీజేపీ చీఫ్

# 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి..
# సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

- హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా ఏజెన్సీని ఏర్పాటు చేశానన్న సీఎం రేవంత్
- బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యలు
- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీవ్ర ఆగ్రహం
- ఇది కాంగ్రెస్ హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనమన్న బీజేపీ
- చారిత్రకంగా రేవంత్ వాదనలో నిజం లేదంటున్న నిపుణులు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఆక్రమణల తొలగింపు, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) వ్యవస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో పేరు పెట్టానని ఆయన స్వయంగా చెప్పడమే ఈ వివాదానికి కారణమైంది. బెంగళూరులో నిన్న జరిగిన 'ది హిందూ' హడిల్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెరువులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై హైడ్రా ఏజెన్సీ తీసుకుంటున్న కఠిన చర్యలను సమర్థించుకుంటూ రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైడ్రా అనే పదం హిట్లర్‌కు చాలా ఇష్టమైనది. ఆయన కోర్ టీమ్‌ను హైడ్రా అని పిలిచేవారు, వారు ఎవరినైనా హతమార్చగలరు. అందుకే నేను హిట్లర్ నుంచి స్ఫూర్తి పొంది దీనికి హైడ్రా అని పేరు పెట్టాను" అని ఆయన వివరించారు. అయితే, రేవంత్ రెడ్డి వాదనలో

## 'జగన్ పాలన సంక్షేమం.. చంద్రబాబు పాలన సంక్షోభం'



- రాష్ట్రానికి పట్టిన చంద్రగ్రహణం ఐదేళ్లు పట్టి పీడిస్తూనే ఉంటుంది
- సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ సిక్స్ మోసాలు.
- కూటమి ప్రభుత్వాన్ని ముంచే ప్రభుత్వం
- "చంద్రబాబు పాలనలో ఏ వర్గమూ సంతృప్తిగా లేదు

## అవినీతిపై సీఎం విజయ్ ఉక్కుపాదం..
## టాస్మాక్ అక్రమ వసూళ్లకు తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే చెక్!



- 'టాస్మాక్'పై విజయ్ కీలక నిర్ణయం
- మద్యం అమ్మకాల్లో లీకేజీలు, అనధికారిక 'పార్టీ ఫండ్' వసూళ్లను తక్షణమే అడ్డుకోవాలని ఆదేశం
- ఈ అక్రమ వసూళ్ల ద్వారా నెలకు రూ. 102 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు గండి

ఢిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత సి.జోసెఫ్ విజయ్ తన మార్క్ పాలనను ప్రారంభించారు. శుక్రవారం జరిగిన తన తొలి క్యాబినెట్ సమావేశంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రభుత్వ మద్యం విక్రయాల సంస్థ

## భారత్‌పై ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు..
## తగ్గుతున్న జననాల రేటుపై ఆందోళన



- భారత్‌లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందన్న మస్క్
- మీడియా సంస్థ 'ఏఎఫ్ పోస్ట్' షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ 'ఎక్స్' పోస్ట్
- ప్రతిస్థాపన స్థాయి 2.1 కంటే కిందకు పడిపోయిన జననాల రేటు

## ఖనిజాన్వేషణలోనూ ఏఐ...
## రూ.100 కోట్లతో భారత్ భారీ ముందడుగు



- ఖనిజాన్వేషణ కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక కేంద్రం
- బెంగళూరులో ఏర్పాటు చేయనున్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వినియోగం

# విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలు కావద్దు.. భారత యువతకు నితిన్ నబిన్ పిలుపు!

ఢిల్లీ: భారత యువత విదేశాల్లో కూర్చున్న కొందరు వ్యక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిందని, వారు ఎవరి మాటలకూ లొంగరని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పేర్కొన్నారు. ప్రతికూల రాజకీయాలకు యువత దూరంగా ఉంటూ, సానుకూల దృక్పథంతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నీట్-యూజీ , సీబీఎస్ఈ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన భారీ నిరసనల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో శనివారం జరిగిన 'మేధావుల సదస్సు' లో నితిన్ నబిన్ ప్రసంగించారు. విదేశీ గడ్డపై నుంచి డిజిటల్ క్యాంపెయిన్ల ద్వారా భారతీయ యువతను ప్రభావితం చేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "విదేశాల్లో కూర్చుని తామే భారత యువతకు దిశా నిర్దేశం చేయగలమని, వారిని కీలుబొమ్మలుగా మార్చవచ్చని కొందరు భావిస్తున్నారు. కానీ, భారత యువత గ్రామాల్లోని రైతుల మధ్య, కోచింగ్ సెంటర్లలో, కాలేజీ క్యాంపస్‌లలో నివసిస్తున్నారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం వారు కీలుబొమ్మలుగా మారడానికి సిద్ధంగా లేరు" అని ఆయన ఉద్ఘాటించారు.

ప్రజాస్వామ్య నిరసనలు ఒకే.. కానీ..

దేశ పురోగతి యువత కష్టపడే తత్వంపైనే ఆధారపడి ఉందన్న నబిన్.. వారిని ప్రతికూల రాజకీయాల్లోకి లాగాలని చూస్తున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే హక్కు అందరికీ ఉందని, అయితే ప్రజాస్వామ్య ప్రమాణాలను కాలరాసే ప్రయత్నాలను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికలను దేశాభివృద్ధికి ఉపయోగించాలి తప్ప, సమాజంలో అలజడులు సృష్టించడానికి కాదని హితవు పలికారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన పొలిటికల్ సెటైరిస్ట్ అభిజీత్ దిప్కే స్థాపించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' కి సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు ఉన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమం జరిగింది. పరీక్షల అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనల వేడి దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసిన తరుణంలో.. బీజేపీ జాతీయ అధ్యక్షుడి వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి.

# భారత్‌పై ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు.. తగ్గుతున్న జననాల రేటుపై ఆందోళన

ఢిల్లీ: ప్రపంచ కుబేరుడు, స్పేస్ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ భారత్‌కు సంబంధించి చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన ప్రతిస్థాపన స్థాయి (రీప్లేస్‌మెంట్ లెవెల్) కంటే కిందకు పడిపోయిందని ఆయన హైలైట్ చేశారు. ఈ అంశంపై మీడియా సంస్థ 'ఏఎఫ్ పోస్ట్' షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "భారత్‌లో జననాల రేటు ప్రతిస్థాపన స్థాయి కంటే తగ్గింది. ముఖ్యంగా, బాగా చదువుకున్న వారిలో ఈ రేటు చాలా ఏళ్ల క్రితమే పడిపోయింది" అని తన పోస్టులో పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని 'ఏఎఫ్ పోస్ట్' నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే ఈ రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. ఢిల్లీలో అయితే ఈ రేటు 1.2కి పడిపోయిందని, ఇది ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025' కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువ అని స్పష్టం చేసింది. సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారి, దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని నివేదిక విశ్లేషించింది. అయితే, జననాల రేటు తగ్గుతున్నప్పటికీ, 146 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతోంది. 2023లో చైనాను అధిగమించి భారత్ ఈ స్థానానికి చేరుకుంది. విద్య, పట్టణీకరణ పెరగడం, మహిళలు ఉద్యోగాల్లో చేరడం, మారుతున్న కుటుంబ ప్రాధాన్యతలు వంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక తెలిపింది.

# ఖనిజాన్వేషణలోనూ ఏఐ... రూ.100 కోట్లతో భారత్ భారీ ముందడుగు

ఢిల్లీ: భారత ఖనిజాన్వేషణ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో కీలకమైన, భూగర్భంలో లోతుగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్ల వ్యయంతో బెంగళూరులో "డేటా ప్రాసెసింగ్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇంటిగ్రేషన్ సెంటర్" (డీపీఐఐసీ)ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నెలకొల్పనుంది. ఈ కేంద్రం దశాబ్దాలుగా సేకరించిన భూగర్భ, భౌగోళిక, రసాయన, ఉపగ్రహ డేటాను విశ్లేషించడానికి ఒక ప్రధాన హబ్‌గా పనిచేస్తుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల సహాయంతో ఖనిజాలు లభించే అధిక సంభావ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక మ్యాపులను రూపొందిస్తుంది. దీనివల్ల సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు నష్టభయం కూడా తగ్గుతుంది. రాబోయే ఐదేళ్లలో దాదాపు 8.5 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఖనిజ సంభావ్యతపై ఈ కేంద్రం విశ్లేషణ చేయనుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అవసరమైన కీలక ఖనిజాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న జాతీయ లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఈ అత్యాధునిక కేంద్రం ఏర్పాటు ప్రణాళికలు కొంతకాలంగా కొనసాగుతుండగా, జూన్ 7న దీనిపై స్పష్టమైన ప్రకటన వెలువడింది. ఈ పరిణామం ఖనిజ భద్రత కోసం సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని, ఇది దేశ ఖనిజాన్వేషణలో ఒక గేమ్-ఛేంజర్‌గా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

మొదటి పేజి తరువాయి

ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

# 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి.. సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

మొదటి పేజి తరువాయి

అందుకే నేను హిట్లర్ నుంచి స్ఫూర్తి పొంది దీనికి హైడ్రా అని పేరు పెట్టాను" అని ఆయన వివరించారు. అయితే, రేవంత్ రెడ్డి వాదనలో చారిత్రక నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్‌కు 'హైడ్రా' పేరుతో ఎలాంటి హంతక బృందం లేదని, వాస్తవానికి నాజీ జర్మనీపై బ్రిటన్ వైమానిక దళం జరిపిన బాంబు దాడి ఆపరేషన్‌కు ఆ పేరుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది కాంగ్రెస్ పార్టీ 'హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి' నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. దీన్ని 'తానాషాహి' (నియంతృత్వం) అని అభివర్ణించారు. గతంలో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ, ఇది కాంగ్రెస్ నైజమని విమర్శించారు. అటు బీఆర్ఎస్ పార్టీ కూడా రేవంత్ వ్యాఖ్యలను ఖండించింది. సోషల్ మీడియాలో సైతం ఈ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

## పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం.. ఉమ్మడి నెల్లూరు జిల్లా కమిటీల రద్దు

మొదటి పేజి తరువాయి

జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ మద్దతుదారులు, జనసైనికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీని బలోపేతం చేశామని, అయితే కొందరు నాయకుల ప్రవర్తన ఆ లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు, సమన్వయ లోపం, క్రమశిక్షణరాహిత్యం కారణంగా పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా, నగర, మండల, గ్రామస్థాయి కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే జిల్లా సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న వారితో పాటు కమిటీల్లోని ఇతర సభ్యులను కూడా తమ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ లేని చోట పార్టీ వ్యవస్థ సక్రమంగా నడవదని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ వివరించారు. కొద్ది రోజుల క్రితం ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త కమిటీ నియామకం జరిగే వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను జనసేన కేంద్ర కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు.

# మోదీ ఇచ్చిన వజ్రాన్ని సొంతం చేసుకోలేకపోయిన జిల్ బైడెన్.. ఆత్మకథలో ఆసక్తికర విషయాల వెల్లడి

మొదటి పేజి తరువాయి



విదేశీ పర్యటనల్లో వచ్చే బహుమతులపై ఉండే కఠినమైన నిబంధనల గురించి ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 2023 జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయన జిల్ బైడెన్‌కు భారతదేశంలో స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన 7.5 క్యారెట్ల కృత్రిమ వజ్రాన్ని బహుమతిగా ఇచ్చారు. "ఆ వజ్రం చాలా అద్భుతంగా ఉంది. ల్యాబ్-గ్రోన్ వజ్రాల తయారీలో భారత్ సాధించిన ప్రగతికి అది ఒక ప్రతిరూపం. ఆ గిఫ్ట్ నన్ను ఎంతగానో ఆకర్షించింది" అని జిల్ బైడెన్ తన పుస్తకంలో రాసుకొచ్చారు.

రూల్స్ అడ్డుపడ్డాయి

అమెరికా నైతిక నిబంధనల ప్రకారం వైట్ హౌస్ అధికారిక హోదాలో అందుకునే ఏ బహుమతి అయినా వ్యక్తిగత సొత్తు కాదు, అది అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికే చెందుతుంది. అయితే, సదరు బహుమతిని మార్కెట్ ధర చెల్లించి సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. "ఈ వజ్రం తన సొంత ఊరిలో 2,500 డాలర్ల (దాదాపు రూ. 2 లక్షలు)తో తయారైందని, దానికి సంబంధించిన బిల్లు కూడా ఉందని ప్రధాని మోదీ నాతో చెప్పారు. దాంతో, అంత తక్కువ ధర అయితే నేనే డబ్బులు కట్టి ఆ వజ్రాన్ని కొనేద్దామని అనుకున్నాను" అని జిల్ బైడెన్ పేర్కొన్నారు. కానీ, ఆమె ప్లాన్ కాస్తా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వాల్యుయేషన్‌తో మారిపోయింది. అమెరికా అధికారులు ఆ వజ్రాన్ని పరిశీలించి దాని విలువ ఏకంగా 20,000 డాలర్లు (సుమారు రూ. 16.6 లక్షలు) గా నిర్ధారించారు. మోదీ చెప్పిన ధర కంటే అధికారులు కట్టిన విలువ చాలా ఎక్కువగా ఉండటంతో ఆమె ఆ వజ్రాన్ని సొంతంగా కొనాలనే ఆలోచనను విరమించుకున్నారు. ఆ తర్వాత నిబంధనల ప్రకారం ఆ వజ్రాన్ని కేవలం అధికారిక వేడుకల కోసం అద్దెకు తీసుకునే వెసులుబాటు ఉండటంతో.. జిల్ బైడెన్ దాన్ని ఒక ఉంగరంలో చేయించుకుని వైట్ హౌస్ ఈవెంట్లలో ధరించారు. అయితే, బైడెన్ ప్రభుత్వం ముగిసి వైట్ హౌస్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఆ ఉంగరాన్ని తిరిగి ప్రభుత్వ స్టోరేజ్ రూమ్‌కు అప్పగించినట్లు ఆమె తెలిపారు. ఇదే సందర్భంలో ఫ్రెంచ్ ఫస్ట్ లేడీ బ్రిగిట్టే మాక్రాన్ ఇచ్చిన బ్రాస్‌లెట్ ధర తక్కువగా ఉండటంతో తానే సొంత డబ్బులు పెట్టి కొనుక్కున్నానని, ఉక్రెయిన్ ఇచ్చిన ఒక బ్రోచ్ విలువను అధికారులు 14,063 డాలర్లుగా తేల్చారని జిల్ బైడెన్ తన పుస్తకంలో గుర్తు చేసుకున్నారు.

# కూటమి ప్రభుత్వానికి ఏపీజేఏసీ హెచ్చరిక.. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే!

అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణకు దిగుతామని ఏపీజేఏసీ అమరావతి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. విజయవాడలో ఆదివారం ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 28 జిల్లాల ప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన కరవు భత్యం (డీఏ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, కొత్త వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ను అమలు చేయాలని నాయకులు ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశాలపై త్వరగా స్పందించకపోతే ఉద్యమించడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం 13 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సోమవారం జూన్ 8 నుంచి తన కార్యాచరణను ప్రారంభిస్తుందని వెల్లడించారు. తమ పోరాటానికి ఇతర ఉద్యోగ సంఘాల నుంచి మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఈ కీలక అంశాలపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాగా, ఏపీఎస్ఆర్టీసీ భవిష్యత్తు కార్యాచరణపై సోమవారం మరో ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు నాయకులు తెలిపారు.

## 'జగన్ పాలన సంక్షేమం.. చంద్రబాబు పాలన సంక్షోభం'



తిరుపతి: రాష్ట్రానికి పట్టిన చంద్రగ్రహణం ఐదేళ్లు పట్టి పీడిస్తూనే ఉంటుందని వైఎస్సార్‌సీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. టీడీపీ అంటే తెలివిగా దోచుకునే పార్టీ, తెలుగు దొంగల పార్టీగా అభివర్ణించారు. కార్యకర్తల పేరుతో రౌడీలను పెంచిపోషిస్తున్నారంటూ భూమన మండిపడ్డారు. "వైఎస్ జగన్ పాలన సంక్షేమం.. కూటమి పాలన సంక్షోభం. సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ సిక్స్ మోసాలు. కూటమి ప్రభుత్వాన్ని ముంచే ప్రభుత్వమని ప్రజలు అనుకుంటున్నారు. ఆడబిడ్డ నిధి ఎక్కడని మహిళలు ప్రశ్నిస్తున్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తల్లికి వందనం పథకాన్ని చంద్రబాబు ఎగ్గొట్టారు. ఫ్రీ బస్సు కస్సుబుస్సులా తయారైంది. దీపం పథకం పేదల పాలిట శాపంగా మారింది. గ్రాఫిక్‌తో గ్యాస్ కొడుతూ వెలగని దీపాన్ని చంద్రబాబు ఇస్తున్నారు" అంటూ భూమన ఆగ్రహం వ్యక్తం చేశారు. "చంద్రబాబు పాలనలో ఏ వర్గమూ సంతృప్తిగా లేదు. అన్నదాతలకు కష్టకాలం.. చంద్రన్న దాతలకు సుఖీభవ. ప్రభుత్వ ఉద్యోగులను నిండా ముంచారు. విద్యారంగం కూటమి పాలనలో హీన దశకు వెళ్లింది. కూటమి పాలనలో పాఠశాలలు నిర్వీర్యమయ్యాయి, ప్రభుత్వ పాఠశాలలకు చంద్రగ్రహణం పట్టింది. ఆంధ్రప్రదేశ్‌ను అప్పులప్రదేశ్‌గా మార్చారు. తాగుదాం ఆంధ్రాగా రాష్ట్రాన్ని చంద్రబాబు మార్చారు. ఇంటింటికి కాదు.. వీధివీధికి బెల్ట్ షాపు తెచ్చారు. గోల్కొండ కట్టింది నేనే, సముద్రాన్ని తవ్వించింది నేనే అని బాబు చెప్పగలరు" అని భూమన ఎద్దేవా చేశారు. "ఎన్టీఆర్‌ను ఒక్కసారి వెన్నుపోటు పొడిచారు, ప్రజలను అనునిత్యం పొడుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బానిసలుగా చూస్తున్నారు. చంద్రబాబు ధర్మపరిరక్షకుడు పవన్ కల్యాణ్. లోకేష్ సేవలో పవన్ లోకాలు మరిచిపోతున్నారు" అంటూ భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## అవినీతిపై సీఎం విజయ్ ఉక్కుపాదం.. టాస్మాక్ అక్రమ వసూళ్లకు తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే చెక్!

మొదటి పేజి తరువాయి



శుక్రవారం జరిగిన తన తొలి క్యాబినెట్ సమావేశంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రభుత్వ మద్యం విక్రయాల సంస్థ 'టాస్మాక్' ప్రక్షాళనపై ఆయన ఉక్కుపాదం మోపారు. టాస్మాక్ హోల్‌సేల్, రవాణా, రిటైల్ విక్రయాలలో జరుగుతున్న భారీ నిధుల మళ్లింపును, అనధికారిక 'పార్టీ ఫండ్' వసూళ్లను తక్షణమే నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చే ప్రతి రూపాయి నేరుగా ప్రభుత్వ ఖజానాకే చేరాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఉన్నతాధికారులు సీఎం విజయ్‌కు సమర్పించిన నివేదికల ప్రకారం.. టాస్మాక్ సరఫరా వ్యవస్థలో నెలకు సుమారు రూ. 102 కోట్ల మేర అనధికారిక వసూళ్లు జరుగుతున్నట్లు తేలింది. ఈ లెక్కన గత ఐదేళ్లలో దాదాపు రూ. 1,600 కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు కాకుండా పక్కదారి పట్టినట్లు అంచనా వేస్తున్నారు. మద్యం తయారీదారుల నుంచి రిటైల్ దుకాణాల వరకు ప్రతి లిక్కర్ కేస్‌పై రూ. 90, బీర్ కేస్‌పై రూ. 40, వైన్ కేస్‌పై రూ. 20 చొప్పున ఈ అక్రమ వసూళ్ల నెట్‌వర్క్ నడుస్తోంది. దీనితో పాటు వివాదాస్పదంగా మారిన 'రూ. 10 ఖాళీ సీసాల డిపాజిట్ స్కీమ్'లో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని గుర్తించారు. ఈ అక్రమాలను అరికట్టేందుకు జూన్ చివరి నాటికి డిపాజిట్ మొత్తాన్ని నేరుగా ఎంఆర్‌పీ (వీఁరా) లో కలపడం లేదా డిజిటల్ రీఫండ్స్ ప్రవేశపెట్టడం వంటి సంస్కరణలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఆదాయం పోయినా పర్లేదు

ఎన్నికల హామీల్లో భాగంగా పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, బస్టాండ్‌లకు 500 మీటర్ల పరిధిలో ఉన్న 717 మద్యం షాపులను మూసివేయాలని సీఎం విజయ్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి సుమారు రూ. 8,000 కోట్ల ఆదాయం తగ్గనుంది. అయినప్పటికీ, ఆ నష్టాన్ని పూడ్చడానికి మద్యం ధరలను పెంచే ఆలోచన లేదని క్యాబినెట్ స్పష్టం చేసింది. ఈ సంస్కరణలపై మద్య నిషేధం, అబ్కారీ శాఖ మంత్రి కె. విగ్నేష్ మాట్లాడుతూ.. "అవినీతి ద్వారా లేదా ప్రజల బాధల ద్వారా వచ్చే ఆదాయం మా ప్రభుత్వానికి అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. లీకేజీలను తక్షణమే అరికట్టి, ప్రజల సొమ్మును తిరిగి ప్రభుత్వ ఖజానాకు చేర్చడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. 'మద్య రహిత తమిళనాడు' లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రక్షాళనలో టాస్మాక్ తర్వాత మైనింగ్ శాఖలోని అక్రమాలపై సీఎం విజయ్ దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. ఈ తొలి క్యాబినెట్ సమావేశంలో ఎన్నికల హామీలకు సంబంధించిన 436 పథకాలపై కూడా మంత్రుల బృందం సమగ్ర సమీక్ష నిర్వహించింది.

## ఏపీలో రేర్ ఎర్త్ హబ్.. రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ

మొదటి పేజి తరువాయి



పవన విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేందుకు గిరెడ్‌మెట్ సాంకేతికతతో నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ ఒ రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు, నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు భాగస్వామ్యం వహించాలని కోరాను'' అని తెలిపారు. మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియాన్ని కూడా లోకేష్ సందర్శించారు. ఈ పర్యటన తనకు ఒక ప్రత్యేక అనుభూతినిచ్చిందని, విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా ఈ మ్యూజియం నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

# కూటమి నేతలతో జూమ్ మీటింగ్.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



అమరావతి,: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు, నరేంద్ర మోదీ ప్రధానిగా పాలన పగ్గాలు చేపట్టి 12 ఏళ్ల అయింది. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన విజయాలపై రాష్ట్రంలో నిర్వహించే బహిరంగసభలను విజయవంతం చేయాలని కూటమిలోని రాజకీయ పక్షాల నేతలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదివారం రాజధాని అమరావతిలో కూటమి పక్షాల నేతలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 9 వ తేదీన తిరుపతి వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభ గురించి వారితో చర్చించారు. ఈ సభకు ఆయా పార్టీల కార్యకర్తలందరిని ఆహ్వానించాలని వారిని కోరారు. అలాగే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి సోదాహరణగా వివరించాలని వారికి సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మూడు ప్రాంతాలలో నిర్వహించే సభలను విజయవంతం చేయాలని వారిని సీఎం చంద్రబాబు కోరారు. టీడీపీ నుంచి పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, బీజేపీ నుంచి పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. జూన్ 4వ తేదీన ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో కూటమిలోని పార్టీల అగ్రనేతలు సమావేశమయ్యారు. ఏపీలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతోపాటు కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఈ సమావేశంలో నేతలు చర్చించారు. అలాగే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతల విమర్శల జోరుకు అడ్డుకట్ట వేయాలని భావించారు. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో జూన్ 9వ తేదీన తిరుపతిలో.. జూన్12వ తేదీన రాజధాని అమరావతిలో.. జూన్ 15వ తేదీన విశాఖపట్నం వేదికగా ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దాంతో ఈ సభలను విజయవంతం చేయాలని ఈ జూమ్ మీటింగ్‌లో ఆయా పార్టీల అగ్రనేతలను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## వేమగిరి అభివృద్ధికి కృషి చేస్తున్నాం: హోంమంత్రి అనిత




అనకాపల్లి జిల్లా, : వేమగిరి అభివృద్ధికి ఎంతగానో తాము కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. వేమగిరిలో చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఎస్ రాయవరం మండలం వేమగిరిలో హోం మంత్రి అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనితకు ఘన స్వాగతం పలికారు గ్రామస్తులు. అడుగడుగున హారతులతో స్వాగతం పలికారు మహిళలు. వేమగిరిలో సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. రూ.70 లక్షల నిధులతో వేమగిరిలోని ధర్మవరం-యలమంచిలిలో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. అనంతరం విశాఖ డైరీ నిధులతో నిర్మించిన శ్రీ తులసి కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో మంచి మెజార్టీతో తాను గెలిచానని హోంమంత్రి అనిత చెప్పుకొచ్చారు. ఎన్నో కుటుంబాలకు వెలుగులు నింపిన వ్యక్తి ఆదారి తులసిరావు అని కొనియాడారు. తనను సొంత కూతురులాగే తులసిరావు చూసుకునేవారని చెప్పుకొచ్చారు. విశాఖ డైరీ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేస్తుంటారని ప్రస్తావించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో కూడా చాలా కార్యక్రమాలు చేశారని తెలిపారు. వేమగిరిలో రూ.70 లక్షలతో రోడ్డు నిర్మించామని అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని.. ఇచ్చిన హామీ ప్రకారం రూ.70 లక్షలతో రోడ్డు వేశామని వెల్లడించారు. రూ.40 లక్షలతో రామాలయానికి నిధులు మంజూరయ్యాయని వివరించారు. రైతులకు సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అడ్డరోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఉపమాక ఆలయంలో చోరీ జరిగిన రెండు రోజుల్లో దొంగలను పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులను హోంమంత్రి అనిత అభినందించారు.

# విజయ్ ప్రభుత్వం మూడు నెలలు కూడా ఉండకపోవచ్చు.. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు..



ఢిల్లీ: డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రస్తుత తమిళనాడు ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. విజేయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం మూడు నెలలైనా కొనసాగుతుందా అనే చర్చ ప్రజల్లో మొదలైందని అన్నారు. తమ కూటమిలోని పార్టీల మద్దతుతోనే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని పేర్కొన్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడిన స్టాలిన్.. విజయ్ ప్రభుత్వం పనితీరు గురించి స్పందించారు. 'విజయ్ ప్రభుత్వ పనితీరును ఆరు నెలల వరకు విమర్శించకూడదని నిర్ణయించుకున్నాం. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించే పరిస్థితిని తీసుకొచ్చాయి. ఐదు, ఆరు నెలలు కాదు.. మూడు నెలలైనా ఈ ప్రభుత్వం నిలుస్తుందా అనే సందేహం ప్రజల్లో కనిపిస్తోంది' అని స్టాలిన్ విమర్శించారు. ఓటర్లను కలవకుండా, బూత్ ఏజెంట్లను కూడా నియమించకుండా గెలిచిన పార్టీ ఎక్కువ రోజులు ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు. తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించడాన్ని అడ్డుకోవాలనే ఏకైక లక్ష్యంతోనే టీవీకేకు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని స్టాలిన్ తెలిపారు (ఖుఎఅశ్రీ చీఖఎబ జూశీశ్రీఙఅఎం). తాము అలా చేయకపోతే తమిళనాడులో బీజేపీ పాలనకు మార్గం సుగమమయ్యేదని, తమ కూటమిలోని పార్టీల మద్దతుతోనే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు.

# రూ.1,511కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన




హైదరాబాద్: ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో రూ.1,511 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. 10 ఎకరాల్లో రూ.98కోట్లతో నిర్మించే మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ.960 కోట్లతో ఏవోసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.416కోట్లతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్‌లో 6 లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. రూ.37.50కోట్లతో 100పడకల మల్కాజ్‌గిరి జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మరోవైపు క్యూర్ వన్ యాప్‌ను ప్రారంభించారు. కాగా, ఈ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహా, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. అలాగే భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీ గణేశ్ పాల్గొన్నారు.

## నాపై అసత్య ప్రచారం తగదు :కొవ్వూరి నాగేంద్ర రెడ్డి



నేటి శుభోదయ ::తాడేపల్లిగూడెం: మీడియాలో తనపై అసత్య ప్రచారం జరుగుతుందని, అసలు ఏమీ లేని విషయాన్ని జరిగినట్టుగా కొన్ని టీవీ ఛానళ్ళు అసత్య ప్రచారం చేయటం తగదని తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొవ్వూరి నాగేంద్ర రెడ్డి అన్నారు.కొన్ని టీవీ ఛానళ్ల లో తాను దొంగ నోట్లు కేసులో అరెస్టయినట్లుగా అసత్య ప్రచారం జరుగుతుందని,ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన అన్నారు. స్థానిక పి అండ్ టి కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు మేడపాటి చెల్లారెడ్డి నివాసంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ మీడియా సమావేశంలో నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా తమ కుటుంబం గురించి తాడేపల్లిగూడెం ప్రజానీకానికి తెలుసని,అత్యంత నిజాయితీగా వ్యవహరించే తమపై ఇలాంటి అసత్య ప్రచారం జరగటం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన సొంత పొలం అమ్మకం వ్యవహారంలో తాను కాకినాడ వెళ్లానని తెలిపారు. అసలు దీనికి ఏ మాత్రం సంబంధం లేని దొంగ నోట్ల వ్యవహారం ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు అన్నారు. కాకినాడ పోలీసు అధికారులు పూర్తి వివరణ ఇచ్చారని అన్నారు. ఎవరో ఇచ్చిన ఫేక్ కాల్ నిమిత్తం పోలీసులు తాము దిగిన లాడ్జికి వచ్చారని, పూర్తి విచారణ అనంతరం ఎలాంటి చట్ట వ్యతిరేక వ్యవహారం జరగలేదని పోలీసులు మీడియాకు తెలియజేశారని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి ప్రాథమిక సమాచారం కాని, ఆధారాలు కానీ లేకుండా రెండు మూడు చానళ్ల లో అసత్య ప్రచారం చేసి తనకు పరువు నష్టం కలిగించారాని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు మేడపాటి చెల్లారెడ్డి, ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి, బేతిరెడ్డి ఉదయ భాస్కర్ రెడ్డి,నల్లిమిల్లి గాంధీ రెడ్డి, నల్లిమిల్లి అంజిరెడ్డి, కర్రీ వరహాలు రెడ్డి, కొవ్వూరి లక్ష్మణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట పోలీసులు నిర్వహించిన ఫిట్ ఇండియా

### – ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీ




కాకినాడ జిల్లా,జగ్గంపేట, జూన్ 07 నేటి శుభోదయ:కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పెద్దాపురం ఎస్డీపీఓ శ్రీ ఏబీజీ తిలక్ మరియు జగ్గంపేట సీఐ శ్రీ బి. తిరుపతిరావు పర్యవేక్షణలో జగ్గంపేట పోలీసులు "ఫిట్ ఇండియా" మరియు "ప్రపంచ సైకిల్ దినోత్సవం" సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై శ్రీ టి. రఘునాధరావు, గండేపల్లి ఎస్సై శ్రీ యువి శివ నాగబాబు మరియు పోలీసు సిబ్బంది పాల్గొని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల శారీరక దృఢత్వం పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది ఎంతగానో



దోహదపడుతుందని తెలిపారు.ఈ సైకిల్ ర్యాలీ జగ్గంపేట పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమై, సర్వీస్ రోడ్ మీదుగా జేవియర్ జంక్షన్, జగ్గంపేట మెయిన్ రోడ్, గోకవరం రోడ్డు మీదుగా కొనసాగింది.ర్యాలీ ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ మరియు సైక్లింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

## పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి-కర్నాకుల డిమాండ్.




కాకినాడ జిల్లా, జగ్గంపేట జూన్ 07 నేటి శుభోదయ: నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి పేద- మధ్యతరగతి కుటుంబాలు బాధపడుతున్న వేళ మరల కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిసిందని కర్నాకుల విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నాడు కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ పరిధి రంగవల్లి నగర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ మూడు నెలలు వ్యవధిలోనే వంట గ్యాస్ ధరలు దప దపాలుగ పెంచుతూ నేడు మరల 29 రుపాయలు పెరగడం, చమురు సంస్థలు లాభాలు వచ్చినప్పుడు ఏమాత్రం తగ్గించకుండా ఇప్పుడు నష్టాలు వచ్చేయంటూ పేద మధ్య తరగతి వినియోగదారుల మీద భారాన్ని మోపడం సరైన పద్ధతి కాదని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. అటు రైతులకు ఎరువుల ధరలు పెంచి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక బాధపడుతున్నారని, ఇటు నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారని, అటు పెట్రోల్ ధరలు డీజిల్ ధరలు పెంచుకుంటూ పోతూ ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. మరోసారి వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజల బ్రతులు మరింత సంక్షోభంలో నెట్టారని ఆయన కేంద్రం ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. తక్షణమే పెంచిన వంట గ్యాస్,పెట్రోల్,డీజిల్, నిత్యావసర ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.దేశం రోజు రోజుకి ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలకు నైతిక బాధ్యత వహిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం దిగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రమేష్,సంఘ నాయకులు కె రామలింగేశ్వర రావు, రంగవల్లి నగర్ నాయకులు డాన్ శ్రీను, కొండేపూడి మంగయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సోనూ సూద్ చేత ఎం ఏ ఫరహా ఘన సత్కారం

### – మహిళా సాధికారతకు ప్రేరణాత్మక సందేశం



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరానికి చెందిన మిస్ ఇండియా ఎం ఏ ఫరహా ని ప్రముఖ బాలీవుడ్ నటుడు, హ్యూమనిటేరియన్ సోనూ సూద్ ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతను ప్రోత్సహించే ఒక ప్రేరణాత్మక వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా సోనూ సూద్ మాట్లాడుతూ ప్రతి మహిళ తనను తాను ప్రతిభా చూపి నిరూపించుకోవాలని, తన లక్ష్యాలను ఎప్పుడూ కొనసాగించాలన్నారు. వివాహం అనంతరం కూడా కలలు, ఆశయాలను వదులుకోకుండా ముందుకు సాగాలని ఆయన సూచించారు. మహిళ తన గుర్తింపును కోల్పోకూడదని, తన శక్తిని సమాజానికి ఉపయోగపడేలా మార్చుకోవాలని ఆయన ప్రేరేపించారు.ఈ సత్కారం ఖమ్మం నగరానికి గర్వకారణంగా నిలిచింది. స్థానికంగా ఉన్న ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం ఆనందకరమైన విషయమని పలువురు అభిప్రాయపడ్డారు.అనంతరం ఎం ఏ ఫరహా మాట్లాడుతూ మహిళలు తమ సామర్థ్యాన్ని గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు. సమాజంలో బలమైన స్థానాన్ని ఏర్పరచుకోవడమే కాకుండా ఇతర మహిళలకు ప్రేరణగా మారాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమం కేవలం వ్యక్తిగత విజయాన్ని మాత్రమే కాకుండా, మహిళా సాధికారతకు బలమైన సందేశాన్ని అందిస్తూ సమాజంలో సానుకూల మార్పుకు దారి చూపిందని నిర్వాహకులు తెలిపారు.

# రాజ్యసభ బరిలో భాష్యం రామకృష్ణ

### – సామాన్య రైతు కుటుంబం నుంచి విద్యా సామ్రాజ్య నిర్మాణం వరకు విజయ పస్థానం– టీడీపీ అధిష్ఠానం నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెడతా : భాష్యం రామకృష్ణ

హైదరాబాద్,గుంటూరు, నేటి శుభోదయ ::: సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, కష్టపడి చదువుకుని, ఉపాధ్యాయుడిగా ప్రారంభమైన ప్రయాణాన్ని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యా ఉద్యమంగా మలిచిన భాష్యం విద్యాసంస్థల వ్యవస్థాపకులు భాష్యం రామకృష్ణ ఇప్పుడు రాజ్యసభ సభ్యత్వానికి పోటీ చేసే అవకాశాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆయన తన జీవిత ప్రయాణం, రాజకీయ ప్రవేశం, భవిష్యత్ లక్ష్యాలను వెల్లడించారు.

### అమ్మ ఆశీస్సులతో మొదలైన విజయగాథ

తాను సాధారణ రైతు కుటుంబంలో జన్మించానని, తన తల్లి ప్రేమ, త్యాగం, ప్రోత్సాహం, ఆశీస్సుల వల్లే ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభించిందని భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి పనిచేయాలనే తపన తనలో ఉండేదని చెప్పారు.

### పాధ్యాయుడి నుంచి విద్యా సంస్థల అధినేతగా

ఒక ప్రైవేట్ పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ట్యూషన్ సెంటర్ నిర్వహించి వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వారిని ఉన్నత స్థాయికి చేర్చడం ద్వారా సమాజం నుంచి విశేష ఆదరణ పొందినట్లు చెప్పారు. ఆ ప్రోత్సాహమే తనలో ఒక విద్యాసంస్థను స్థాపించాలనే సంకల్పానికి



నాంది పలికిందని, ఆ సంకల్ప ఫలితంగానే 1993లో "భాష్యం విద్యాసంస్థలు" ప్రారంభమైనట్లు వివరించారు.

### మూడు రాష్ట్రాల్లో విస్తరించిన భాష్యం విద్యా ఉద్యమం

నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధన లక్ష్యంగా ప్రారంభమైన భాష్యం విద్యాసంస్థలు నేడు మూడు రాష్ట్రాలకు విస్తరించి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. ఈ స్థాయికి సంస్థ ఎదగడం తనకు ఎంతో ఆనందం, గర్వకారణమని పేర్కొన్నారు.

### -ఎన్టీఆర్ స్ఫూర్తి, చంద్రబాబు ప్రోత్సాహం

చిన్ననాటి నుంచే తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మహానేత నందమూరి తారక రామారావు పట్ల తనకు అపారమైన అభిమానం ఉందని భాష్యం రామకృష్ణ వెల్లడించారు. తదనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన విద్యాసేవలను గుర్తించి 2014, 2019, 2024 సంవత్సరాల్లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని, ప్రజాసేవలో మరింత విస్తృత పాత్ర పోషించాలని ప్రోత్సహించారని తెలిపారు.

### - రాజ్యసభ అవకాశం కల్పించిన టీడీపీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు

తనపై విశ్వాసం ఉంచి రాజ్యసభ సభ్యత్వానికి పోటీ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, అలాగే తెలుగు దేశం పార్టీ నాయకత్వానికి భాష్యం రామకృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఒక సాధారణ రైతు కుటుంబానికి చెందిన తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకం గౌరవంతో పాటు మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.

### - రాష్ట్రాభివృద్ధి, విద్యారంగ పురోగతే లక్ష్యం

రాజ్యసభ వేదికగా రాష్ట్ర అభివృద్ధి, విద్యారంగ పురోగతి, యువత భవిష్యత్ నిర్మాణం, సమాజ సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని భాష్యం రామకృష్ణ స్పష్టం చేశారు. తనను ఈ స్థాయికి తీసుకువచ్చిన ప్రజలకు, కుటుంబ సభ్యులకు, సహచరులకు, తెలుగు దేశం పార్టీకి జీవితాంతం కృతజ్ఞుడిగా ఉంటానని చెప్పారు."నాపై ఉంచిన విశ్వాసాన్ని కార్యరూపంలో నిలబెడతాను. ప్రజాసేవకు నా శక్తి సామర్థ్యాలన్నింటినీ వినియోగిస్తాను అని చెప్పారు.

## రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ



యువనేతకు జాక్‌పాట్, ఆయనకు మరోసారి అవకాశం అమరావతి, నేటి శుభోదయ ::: తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. తమ పార్టీ రాజ్యసభ అభ్యర్థులుగా విద్యావేత్త భాష్యం రామకృష్ణ, కాకినాడకు చెందిన సానా సతీష్, యువ నాయకుడు చింతకాయల విజయ్‌ల పేర్లను టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించారు.సామాజిక సమతూకాన్ని పాటిస్తూ పార్టీ పట్ల అంకితభావం, యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూ వీరిని ఎంపిక చేసినట్లు టీడీపీ వర్గాలు వెల్లడించాయి. అభ్యర్థుల పేర్లు ఖరారు చేసిన వెంటనే చంద్రబాబు వారికి శనివారం రాత్రే పార్టీ కార్యాలయంలో బీ-ఫామ్‌లను అందజేశారు.రామకృష్ణ, సానా సతీష్‌ల అభ్యర్థిత్వాలను చంద్రబాబు శుక్రవారమే ఖరారు చేయగా మూడో స్థానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరి నిమిషం వరకు చింతకాయల విజయ్‌తో పాటు పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్య పేర్లు పరిశీలనకు వచ్చాయి. అయితే బీసి సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు భవిష్యత్ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అధిష్ఠానం విజయ్ వైపే మొగ్గు చూపింది. విజయ్ తండ్రి అయ్యన్నపాత్రుడు ప్రస్తుతం శాసనసభాపతిగా సేవలందిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న కాలంలో విజయ్ పార్టీ ఐటీ వింగ్, సోషల్ మీడియా వేదికగా అందించిన సేవలు ఆయనకు కలిసివచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన అనకాపల్లి లోక్‌సభ టికెట్ ఆశించినప్పటికీ పొత్తుల సమీకరణాల వల్ల త్యాగం చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు గట్టిగా కోరడం ఆయన విజ్ఞప్తిని మేరకు చంద్రబాబు విజయ్‌కు అవకాశం కల్పించారు.మరో అభ్యర్థి భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ విద్యావేత్తగా మంచి గుర్తింపు పొందారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి ఆర్థికంగా, వ్యూహాత్మకంగా అండగా నిలిచారు. 2024 ఎన్నికల తర్వాత కూడా పార్టీ సంస్థాగత నిర్మాణం, శ్రేణులకు శిక్షణ కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. 2024 ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానాన్ని ఆశించారు. టికెట్ దక్కకపోయినా నిరాశ చెందకుండా పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు గాను ఆయనకు ఈ అవకాశం దక్కింది. అలాగే, కాకినాడకు చెందిన సానా సతీష్ గతంలో మోపిదేవి వెంకటరమణారావు రాజీనామాతో వచ్చిన ఉపఎన్నికలో ఏడాదిన్నర కాలం పాటు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. కాపు సామాజికవర్గ సమీకరణాలు, ఆయన సేవలను గుర్తించి చంద్రబాబు మరోసారి పూర్తికాలం పాటు సతీష్‌కు అవకాశం కల్పించారు.రాష్ట్రం నుండి ఖాళీ అయిన నాలుగు స్థానాల్లో టీడీపీ మూడు స్థానాలు తీసుకోగా, మిత్రపక్షమైన జనసేనకు ఒక స్థానాన్ని కేటాయించారు. జనసేన అభ్యర్థిగా ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ శనివారం నాడే తన నామినేషన్ దాఖలు చేశారు. తెదేపా అభ్యర్థులు ముగ్గురు సోమవారం నాడు నామినేషన్లు వేయనున్నారు. ప్రస్తుత శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని సంఖ్యాబలం దృష్ట్యా ఈ నలుగురు అభ్యర్థుల ఎన్నిక కేవలం లాంఛనమే కానుంది. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## కల్లూరులో ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



పులిచెర్ల, జూన్ 7,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్సార్ పెట్రోల్ బంక్ సమీపంలోని ర్యాంప్‌పై నుంచి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో పాకాల మండలం ఆదుసుపల్లికి చెందిన రాజశేఖర్ (35) అక్కడికక్కడే మృతిచెందాడు.సమాచారం అందుకున్న కల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బైక్ చోరీ ముఠా అరెస్ట్ నాలుగు వాహనాలు స్వాధీనం



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసులు బైక్ చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు నిందితుల నుంచి చోరీకి గురైన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు తాళం వేయ కుండా లేదా బలహీనమైన హ్యాండిల్ లాక్ ఉన్న బైక్‌లనే లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో నిందితులు అంగీకరించారు కేసు నమోదు చేసి వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు వాహన దారులు తమ ద్విచక్ర వాహనాలకు పటిష్టమైన లాకింగ్ సిస్టమ్ ఉపయోగిం చాలని పోలీసులు సూచించారు ఈ కార్య క్రమంలో నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు రూరల్ సిఐ రేవతమ్మ,నాతవరం ఎస్సై తారకేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం నగరానికి వరదల నుంచి రక్షణ కవచం మున్నేరు రిటైనింగ్ వాల్ వర్షాకాలానికి పూర్తి అవుతుందా...

### – రూ.690 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టుపై నగర ప్రజల్లో ఆందోళన

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరాన్ని వరదల బీభత్సం నుంచి శాశ్వతంగా రక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం ఇప్పుడు ప్రజల్లో ఆసక్తితో పాటు ఆందోళనకూ కారణమవుతోంది. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులు పూర్తిస్థాయిలో ముగుస్తాయా, ఈ ఏడాది వరదల ప్రభావాన్ని తట్టుకునే స్థాయిలో రక్షణ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందా అనే సందేహాలు నగరవాసుల్లో వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు ఖమ్మం నగర భవిష్యత్తుకు కీలకంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్నేరు వరదలు నగరాన్ని ముంచెత్తిన నేపథ్యంలో శాశ్వత పరిష్కారం కోసం రూ.690 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.పనుల పురోగతిపై మంత్రి తుమ్మల ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తూ వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనుల వేగంపై పలు





ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2024లో కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదలతో మున్నేరు ఉగ్రరూపం దాల్చింది. 33 అడుగుల రికార్డు స్థాయి నీటిమట్టం నమోదై నగరంలోని పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.ప్రభుత్వ అంచనాల ప్రకారం దాదాపు రూ.790 కోట్ల మేర ఆస్తి, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లింది. వ్యాపార సంస్థలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, డ్రైనేజీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్నేరు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. 2024 వరదల సమయంలో మున్నేరు నదిలో సుమారు మూడున్నర లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైంది. ఈ ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో మరింత భారీ వరదలు వచ్చినా ఖమ్మం నగరానికి ముప్పు లేకుండా రిటైనింగ్ వాల్ డిజైన్ రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.జూన్ నెలలోనే వర్షాకాలం ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో ఇంకా మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులు శరవేగంగా సాగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.ప్రతి రోజు విలువైనదిగా మారిన ఈ సమయంలో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టు సంస్థలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. రిటైనింగ్ వాల్ అందుబాటులోకి వస్తే మున్నేరు పరివాహక ప్రాంతాల్లో నివసించే వేలాది కుటుంబాలకు రక్షణ లభిస్తుంది. వరదల భయంతో ప్రతి ఏటా ఎదురయ్యే ఆందోళనకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. నగర అభివృద్ధికి కొత్త ఊపు వస్తుంది. ఆస్తి, ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. భవిష్యత్తులో మున్నేరు సమీప ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి భరోసా ఏర్పడుతుంది.గత వరదల బీభత్సాన్ని ప్రత్యక్షంగా చూసిన ఖమ్మం ప్రజలు ఈసారి అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదని కోరుకుంటున్నారు. రూ.690 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న మున్నేరు రిటైనింగ్ వాల్ కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదు. లక్షలాది మంది ప్రజల భద్రతకు, నగర భవిష్యత్తుకు సంబంధించిన అంశంగా మారింది. మున్నేరు మళ్లీ ఉగ్రరూపం దాల్చేలోపు రిటైనింగ్ వాల్ పూర్తి అవుతుందా, గత ఏడాది ఎదురైన విపత్తు నుంచి ఖమ్మం ఈసారి పూర్తిస్థాయిలో రక్షణ పొందుతుందా అనే ప్రశ్నలకు సమాధానం రానున్న కొద్ది వారాల్లోనే తేలనుంది. ఖమ్మం ప్రజల భద్రతకు రక్షణ కవచంగా భావిస్తున్న మున్నేరు రిటైనింగ్ వాల్ సమయానికి పూర్తి కావడమే ఇప్పుడు అందరి ఆకాంక్ష.



# నిడిగట్లలో శ్రీశ్రీశ్రీ తలుపులమ్మ తల్లి జాతర
## మహోత్సవాలకు రామసేన అధ్యక్షుడు
# 'కంబాల' లక్ష రూపాయలు విరాళం...!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి(ఏ.కె);రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో శ్రీ తలుపులమ్మ వారి జాతర మహోత్సవ సందర్భంగా ఆదివారం నిర్వహించిన, అన్న సమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు భారీ విరాళాలు అందించారు. కంబాల శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆదివారం శ్రీ తలుపులమ్మ జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. వారికి తొలిత కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అన్న సమారాధన కార్యక్రమం పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కంబాల శ్రీనివాసరావు అందుబాటులో లేనప్పటికీ, ఆలయ కమిటీ సభ్యుల సహకారం మేరకు అన్నసమారాధన కార్యక్రమానికి లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఆ విరాళం చెక్కును రామసేన సభ్యులు బీజేపీ నాయకులు కమిటీ సభ్యులు గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, బత్తిన వీరాంజనేయులు, నాగ రమేష్, మళ్ల అదిశేషు, ధార శ్రీను, కాకర దుర్గారావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...




# కిక్ బాక్సింగ్ కోచింగ్ క్యాంప్ ని సందర్శించిన
## ఎలుసురి శివకుమార్



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం విశాఖ పశ్చిమ నియోజకవర్గం స్థానిక 56వ వార్డు పరిధి కంచరపాలెం ఆర్ పి వేట ఉన్నత పాఠశాల నందు శనివారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు మేరకు జోనల్ కమిషనర్ హైమావతి పర్యవేక్షణలో అల్ ఇండియా ఎన్సీంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, టైగర్ కిక్ బాక్సింగ్ కౌన్సిల్ అసోసియేషన్ సీనియర్ మాస్టర్ గుండి జానకి రాము ఆధ్వర్యంలో జీవీఎంసీ వారి ఉచిత కిక్ బాక్సింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించడం జరుగుచున్నది.ఈ తరుణంలో కిక్ బాక్సింగ్ కోచింగ్ క్యాంప్ ని విశాఖ జిల్లా టిడిపి యూత్ నాయకులు ఎలుసురి శివకుమార్ సందర్శించారు. అనంతరం కిక్ బాక్సింగ్ నేర్చుకుంటున్న పిల్లలకు ఆయన సొంత నిధులతో పాలు ప్యాకెట్, టాటా గ్లూకోజ్ ప్యాకెట్,బిస్కెట్ ప్యాకెట్లను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ప్రతి ఒక్కరూ క్రీడారంగంలో ప్రాధన్యత కలిగి ఉండాలని ముఖ్యంగా ఆడపిల్లలు కిక్ బాక్సింగ్,కరాటే వంటి ఆత్మరక్షణ క్రీడాలను అభ్యసించాలని అదేవిధంగా ప్రతి ఒక్కరూ జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని మీ ఊరికి,ఈ జిల్లాకి తద్వారా మన రాష్ట్రానికి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్ గుండి జానకి రాము,అసిస్టెంట్ కోచ్ బి భరత్,గుండి యశోద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.68 లక్షల క్యాన్సర్ చికిత్స విశాఖ కే జి హెచ్ లో ఉచితం!



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం చీఫ్ బ్యూరో జగన్ )విశాఖపట్నం కేజీహెచ్లో లంగ్ క్యాన్సర్ రోగులకు అత్యంత ఖరీదైన 'ఇమ్యునోథెరపీ' చికిత్సను ఉచితంగా అందించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ప్రకటించారు. 18 నుండి 65 ఏళ్ల వయసు వారికి క్లినికల్ ట్రయల్స్ ద్వారా ఏడాదిపాటు ఒక్కో సైకిల్కు రూ.4 లక్షల విలువైన మందును ప్రతి 3 వారాలకు ఒకసారి చొప్పున మొత్తం 17 సార్లు ఉచితంగా అందిస్తారు. అంటే రూ.68 లక్షల విలువైన చికిత్స ఫ్రీగా అందనుంది.

# అధికారి ఇంట్లో ఏసీబీ దాడులు.. కోట్ల అక్రమాస్తులు గుర్తింపు!



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) కాకినాడ జిల్లా కలెక్టరేట్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శివరాం కుమార్ పై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఇవాళ నాలుగు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. ఈ దాడుల్లో తెలంగాణ, కాకినాడల్లో లగ్జరీ ఫ్లాట్లు, 700 గ్రాముల బంగారం, ఫార్చ్యూనర్, థార్ వంటి ఖరీదైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆస్తుల పూర్తి విలువ పై లెక్కింపు కొనసాగుతోంది.

# జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రాజకీయ పార్టీలు జెండాలతో నిరసనలు తెలపడం దురదృష్టకారం
## -బి. సి. ఐక్యవేదిక లీగల్ అడ్వైజర్ కొలుసు రాజా

గుడివాడ, జూన్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రాజకీయపార్టీలుఆయా పార్టీలకు చెందిన జండాలు కట్టి నిరసనలు తెలుపడం దురదృష్టకరమని గుడివాడ బి. సి. ఐక్యవేదిక లీగల్ అడ్వైజర్ కొలుసు రాజా ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ సంఘసంస్కర్త, సామాజిక విప్లవకారుడు, అణగారిన వర్గాల విముక్తికి మహిళా సాధికారతకు, మహిళల విద్యకు ప్రోత్సహించిన పుణ్య మూర్తులు జ్యోతిరావు పూలే,సావిత్రిబాయి పూలే వారి జీవిత విశేషాలు ఆదర్శంగా భవిష్యత్ తరాలకు తెలియచేసేందుకు గుడివాడ నడిబొడ్డున పూలే దంపతులు కాంస్య విగ్రహాలు బిసి సంఘం ఆధ్వర్యంలో పార్టీలకి, కులాలకి, మతాలకు అతీతంగా నిర్మించుకోవడం జరిగిందన్నారు . ఆటువంటి పవిత్రమైన విగ్రహాల దగ్గర వివిధ రాజకీయ పార్టీలు రాజకీయ బ్యానర్లతోనూ జండాలతోనూ నిరసన కార్యక్రమం చేయుట దురదృష్టకరమని ఈ విషయాన్ని ఖండిస్తూ భవిష్యత్తులో ఇలాంటి నిరసనలు పూలే విగ్రహాల దగ్గర చేయవద్దని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎవరైనా వారిని గౌరవించుకోవాలి తప్ప, వారి వద్ద రాజకీయాలు చేయటం అనేది మంచి పని కాదని అన్నారు.

# "అందరివాడు ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం జూన్7 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ)::: ఎవరికి ఏ కష్టం వచ్చినా కులం, మతం, ఏ రాజకీయ పార్టీ అని చూడకుండా అందరివాడిగా తక్షణమే స్పందించి ఆదుకునే ఉన్నత వ్యక్తిత్వం గల బొలిశెట్టి శ్రీనివాస్ ఎమ్మెల్యే కావటం తాడేపల్లిగూడెం ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారని గూడెం మండల జనసేన నాయకులు పేర్కొన్నారు.కూటమి పాలన రెండేళ్లు పూర్తయిన సందర్భంగా,తాడేపల్లిగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో, జగన్నాథపురం గ్రామంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెం మండలం నరకంగా మారిందని, రోడ్లు లేక మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని అన్నారు.వైసిపి అవినీతి, అక్రమాలను భరించలేక ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించి 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు.రెండేళ్లు గడిచినా ఇంకా ఆ పార్టీ గుణపాఠం నేర్చుకోలేదని విమర్శించారు. వైసిపి ప్రవర్తన మార్చుకోకపోతే ప్రస్తుతం 40శాతం అని చెప్పుకుంటున్న ఓట్ల శాతం 4 శాతానికి పడిపోక తప్పదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లా విజయవంతమైన సారధ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వెన్నుపోటు అంటూ వైసీపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంటే వైసీపీ నేతలకు కళ్ళు కనిపించడం లేదన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో నవాబ్ పాలెం, అప్పారావుపేట,మాధవరం, వెంకట్రావు పాలెం తదితర గ్రామాల ప్రధాన రహదారులు వైసిపి పాలన లో శిథిలావస్థకు చేరాయని అన్నారు. బొలిశెట్టి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నియోజకవర్గంలోని రోడ్లన్నిటిని పూర్తిచేయాలనే సంకల్పంతో రోడ్ల నిర్మాణం చేపట్టి రెండేళ్లలో పూర్తిచేసిన ఘనత ఎమ్మెల్యేకి దక్కిందని అన్నారు.అభివృద్ధి తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి తన సొంత నిధులతో భారీ ఎత్తున చేస్తున్న దానధర్మాలు, సేవా కార్యక్రమాలు అపూర్వమని అన్నారు. జనసేన కార్యకర్త ఎవరైనా మరణిస్తే తన సొంత నిధులు 5లక్షలు ఇచ్చి ఆదు కుంటారని, ఇతర పార్టీలకు చెందిన వారు,గత ఎన్నికల్లో తన ఓటమికి పనిచేసిన వారైనా ఆపద వస్తే ఆదుకోవడంలో ఆయనే ముందుంటారని అన్నారు. ఆయన కార్యదక్షత, దాతృత్వం, ఉత్తమ నాయకత్వం కారణంగా రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ ల తర్వాత అత్యధిక చరిష్మా కలిగిన నేత గా నిలిచారని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలోనూ ప్రథమ స్థానంలో నిలిపే విధంగా నిజాయితీగా పనిచేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టికి ప్రజలందరూ అండగా నిలవాలని వారు కోరారు. ఈ సమావేశంలో గూడెం మండల జనసేన నాయకులు మాట్లాడారు.

# 'రైతులు సామూహికంగా ఉద్యమిస్తేనే భూముల సమస్య పరిష్కారం..'
### రోజులు గడిచినా కలగని కోరుకొండ భూముల విముక్తి..
### రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రైతులు సామూహికంగా ఉద్యమిస్తే తప్ప కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం అయ్యే పరిస్థితి కనిపించడం లేదని, 70 రోజులు గడిచినా కోరుకొండ భూములకు విముక్తి కలగలేదని రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోరుకొండ హరే రామ సమాజం నందు కోరుకొండ భూముల సమస్యకు సంబంధించి రైతుల ఆహ్వానం మేరకు శనివారం సాయంత్రం హాజరైన జితేంద్ర రైతు సమస్యలపై చర్చించారు. తాను మార్చి 21వ తేదీన కోరుకొండ భూముల సమస్యపై మీడియా సమావేశంలో మాట్లాడానని వెల్లడించారు. అయితే అనంతరం ఎమ్మెల్యే బలరామకృష్ణ రైతుల సమస్య పరిష్కారమైందని ఆయన వెల్లడించారన్నారు. 70 రోజులు గడిచినప్పటికీ, ఇంతవరకు ఆ సమస్య పరిష్కారం కాలేదని రైతులు ఇబ్బందులు, అవస్థలు పడుతున్నారని తెలియజేశారు. 22 ఏ నుండి తీసేసిన భూములను రీ సర్వే పేరుతో చేర్చి అధికారులు తప్పిదం చేసారన్నారు. కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ కు సంబంధించి అధికారులకు ఏవిధమైన డాక్యుమెంటు ఇవ్వవలసిన అవసరం లేదని ప్రలోబాలకు గురి కావలసిన అవసరం లేదని తెలియజేశారు. అవసరమైతే లోకాయుక్తలో కేసులు వేస్తామని, హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తామని తెలియజేశారు. వారం రోజుల్లో 22 ఏ నుండి తప్పించాల్సిన సమస్యను రోజుల తరబడి గడుపుతుండాటాన్ని తప్పు పట్టారు. ఇటువంటి భూ సమస్యల బాధితుల దరఖాస్తులను అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన సూచనలతోనే ఈసమస్యలపై ప్రశ్నించడం జరుగుతుందన్నారు. ఇటీవల జరిగిన తెలుగుదేశం మహానాడులో ప్రజా సమస్యలపై కూడా నిలదీసే హక్కు ప్రజలకు ఉందని తెలుగుదేశం ప్రకటించడానికి గుర్తు చేశారు. కోరుకొండ భూ సమస్యను తక్షణమే ఎమ్మెల్యే పరిష్కరించాలని రైతుల కోసమే తాను పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 37 కేసులు లోకాయుక్తలో వేయడం జరిగిందని వివరించారు. 259 ఎకరాలు 22 ఏ లో ఉండగా, 35 ఎకరాలు గ్రామ సర్వీస్ ఈనాము భూములు ఉన్నాయని ఇవన్నీ రిజిస్ట్రేషన్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. రైతులంతా సమన్వయంతో ఐకమత్యంగా పోరాడితే తప్ప అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపించే అవకాశాలు కనిపించడం లేదని విమర్శించారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు నండూరి రామకృష్ణ, మాదినీడి లక్ష్మణరావు, కాటూరి మోహన్రావు, కోడి నాగుల ప్రసాద్, కోసూరి శ్రీనివాస్, ఉప్పలపాటి అబ్బు, కప్పల మధు, యవ్వాకుల నాగేశ్వరరావు, నెక్కంటి మురళి, కేతినిడి నాని తదితర రైతులు పాల్గొన్నారు.

# నకలీ మందులు నివారణకు.. మందు లేదా
### డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ప్రతినెల ఫార్మసీ షాపుల్ని తనిఖీ చేయవలెను..!!
### ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సర్టిఫికెట్ ఉందా లేదా అని ప్రత్యేకంగా చెక్ చేయాలి..
### ఔషధ ఎక్కువ తక్కువ ధరలలో నియంత్రణ చెక్ చేయవలెను..



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం హెల్త్ సిటీ అంటున్నారు.. మరియు పారిశ్రామిక ప్రాంతంలో గాజువాక ప్రాంతాలలో దాన్ని తగ్గట్టు మెడికల్ స్టోర్ రూమ్ లో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్షిప్ ఉన్నదా ప్రతి ఔషధ షాప్ కి మరి ప్రత్యేకంగా అత్యవసర మందులు కొనుగోలు చేసినప్పుడు డాక్టర్ యొక్క ప్రిస్క్రిప్షన్ ఉన్నాదా లేదా అని చెక్ చేసి మందులు అమ్మవలెను,నియంత్రణ అధికారి ప్రతినెల ప్రతి షాప్ ని తనిఖీ చేయవలెను, ప్రజలకు కావాల్సిన ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి ఏ మందు వాడితే నివారణ చర్యలు ఉన్నాయి ఫార్మసీ షాపు లు యొక్క లైసెన్సులు ఉన్నాయా లేవా పాన్సీ సర్టిఫికెట్ యొక్క డిస్ప్లే లో పెట్టవలెను.నకిలీ మందుల నివారణకు కఠిన చర్యలు అవసరంప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ మందుల తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం, ఔషధ నియంత్రణ శాఖ మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నకిలీ మందుల వల్ల రోగులకు సరైన చికిత్స అందకపోవడమే కాకుండా, ఆరోగ్య పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది.ఔషధాలు కొనుగోలు చేసే సమయంలో ప్రజలు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, మందుల ప్యాకెట్పై తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, తయారీ సంస్థ వివరాలు పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. అనుమానాస్పద మందులు కనిపిస్తే వెంటనే డ్రగ్ కంట్రోల్ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.నకిలీ మందుల తయారీదారులు, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా నకిలీ మందుల ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ధరలపై కూడా తగిన చర్యలు తీసుకోవలెను ఆంధ్రప్రదేశ్ సంబంధించిన డ్రగ్స్ ఇన్స్పెక్టర్ నివారణ అధికారాన్ని ప్రతినెల ప్రతి ఫార్మసీ షాపు ను చెక్ చేసుకోవలెను, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రతి పౌరుడిని ఆరోగ్యవంతుడుగా తయారు చేయవలెను అని ప్రజలు కోరుతున్నారు.




# శ్రీ ఆంజనేయ స్వామికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి ప్రత్యేక పూజలు



నంద్యాల, నేటి శుభోదయ ::: నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి శ్రీఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయం గుడికి కేటాయించాలని, చిన్నపిల్లలు, పెద్దలు, యువకులు అందరూ శ్రీ హనుమాన్ చాలీశా పఠనం చేయాలని, వారం వారం అందరూ ఆంజనేయ స్వామి గుడికి వచ్చి భక్తిశ్రద్ధలతో అందరూ భక్తి మార్గంలో నడవాలని గ్రామ ప్రజలను కోరారు.



# బాపట్ల మున్సిపల్ కమిషనర్గా హాసిని బాధ్యతల స్వీకరణ



బాపట్ల నేటి శుభోదయజూన్ 7:బాపట్ల మున్సిపల్ కమిషనర్ గా హాసిని ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హాసిని మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం మున్సిపల్ శాఖ అధికారులతో సమావేశమై పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల పురపాలక సంఘం,



బాపట్ల నేటి శుభోదయజూన్ 7:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బాపట్ల పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో బాపట్ల పురపాలక సంఘ కమిషనర్ . హాసిని పాల్గొని కార్యాలయ ఉద్యానవనంలో మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణ, హరిత వనం పెంపొందించడం, మరియు కార్యాలయ పరిసరాలను శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.పరిశుభ్రతతో పాటు హరితాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమములో మేనేజర్ యం.చంద్రమోహన్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యస్.యస్ .అర్.కృష్ణారెడ్డి,అసిస్టెంట్ ఇంజనీర్ చల్ల శ్రీనివాసరావు,రెవిన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బార్,శానిటరీ ఇన్స్పెక్టర్ చేవూరి కరుణా మరియు పురపాలక సంఘ సిబ్బంది ఉన్నారు.

# కార్మిక బంధువు, ప్రజానేతగా పల్లా సింహాచలం..



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) కార్మిక బంధువు ప్రజాదరణ కలిగిన నాయకులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు శ్రీ పల్లా శ్రీనివాసరావు వారి తండ్రి వారి అయినటువంటి శ్రీ పల్లా సింహాచలం వారి ప్రథమ వర్ధంతి 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి దశేంద్ర వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లా సింహాచలం వారిని ప్రతి ఒక్కరు కూడా ఆదర్శంగా తీసుకోవాలని, కార్మికుల కోసం ప్రజల కోసం నిత్యం ఆయన తపించేవారని ఈ గాజువాక నియోజకవర్గానికి మంచి సేవ చేసే నాయకుల్ని శ్రీ పల్లా శ్రీనివాసరావు వారిని ఆయన అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు ఉపాధ్యక్షులు కరణం సత్యారావు , మాజీ కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ , కోసూరి తాతారావు, బలిరెడ్డి సత్యనారాయణ,వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం నూకరాజు ,హాస్పిటల్ డైరెక్టర్స్ డొక్కా రమేష్ , రవణమ్మ నూకరాజు , గొల్లవిల్లి కమాండో నూకరాజు, పొన్నగంటి వెంకటరమణ, ఊరుకూటి అప్పలరాజు, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, వార్డు ఉపాధ్యక్షులు కడవల రమణ, మెల్లి అప్పారావు, కరణం సన్నీ, కరణం అప్పారావు, కొర్రాయి జగదీష్, నందగోపాల్, బంతి కోళ్ళు సత్తిబాబు, గాజువాక నియోజకవర్గం మహిళా ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, వార్డ్ మహిళా జనరల్ సెక్రెటరీ రావాడ శిరీష, వార్డ్ ఐ టీడీపీ జనరల్ సెక్రెటరీ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలను కాపాడిన జర్నలిస్టులు.. బాపట్లలో
# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం



బాపట్ల నేటి శుభోదయజూన్ 7 :బాపట్లలో అర్ధరాత్రి చోటుచేసుకున్న ఓ రోడ్డు ప్రమాద ఘటనలో స్థానిక జర్నలిస్టులు చూపిన మానవత్వం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. చీరాల నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తులు గులాం హుసేన్ తోట సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలతో రోడ్డుపై సహాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో బాపట్లకు చెందిన జర్నలిస్టులు గోపి, సందీప్తో పాటు మరో వ్యక్తి వెంటనే స్పందించారు.అంబులెన్స్ కోసం వేచి చూడకుండా, విలువైన సమయం వృథా కాకుండా తమ సొంత వాహనంలోనే క్షతగాత్రులను బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందేలా చేశారు. వారి సకాలంలో తీసుకున్న నిర్ణయం వల్ల బాధితులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.ప్రజల స్పందనఈ ఘటనపై బాపట్ల ప్రజలు జర్నలిస్టుల సేవాభావాన్ని కొనియాడుతున్నారు. "వార్తలను అందించే జర్నలిస్టులు మాత్రమే కాదు.. అవసరమైనప్పుడు ప్రాణాలను కాపాడే దేవుళ్లుగా కూడా నిలుస్తారని వారు నిరూపించారు." "అర్ధరాత్రి సమయంలో చాలామంది చూస్తూ వెళ్లిపోయే పరిస్థితుల్లో, మానవత్వంతో స్పందించి బాధితులను ఆసుపత్రికి చేర్చడం అభినందనీయం."

## వడ్డే నారాయణరావు నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం

**– పెద్దగోపతి, చిన్నగోపతి గ్రామాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం మంజూరు చేయాలని విజ్ఞప్తి – వెంటనే ఆమోదించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**



ఖమ్మం, కొణిజర్ల, నేటి శుభోదయ :::టీపీసీసీ సభ్యులు, కొణిజర్ల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వడ్డే నారాయణరావు నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన తేనీటి విందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో మాట్లాడిన వడ్డే నారాయణరావు కొణిజర్ల మండల పరిధిలోని పెద్దగోపతి, చిన్నగోపతి గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం సోలార్ పవర్ ఆధారిత విద్యుత్ సౌకర్యాన్ని మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. గ్రామాల్లో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం ద్వారా గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సోలార్ విద్యుత్ సౌకర్యం మంజూరుకు వెంటనే ఆమోదం తెలుపడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్డే నారాయణరావు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం అండగా నిలవాలని కోరారు. అలాగే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సదుపాయాలు, అంతర్గత రహదారులు, విద్యుత్ వ్యవస్థ బలోపేతం, వ్యవసాయానికి అవసరమైన మద్దతు వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక నాయకులు ఉప ముఖ్యమంత్రిని కోరారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం ద్వారా అభివృద్ధికి సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొణిజర్ల మండలానికి చెందిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి సమక్షంలో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా జరిగిన ఈ సమావేశం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సోలార్ విద్యుత్ సౌకర్యం మంజూరు నిర్ణయం గ్రామాల భవిష్యత్ అభివృద్ధికి దోహదపడుతుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఖమ్మం జిల్లా టిజి -20 జట్టుకు ఎంపికైన సహేంద్ర మల్లు



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నందిని విక్రమార్క ల కుమారుడు సహేంద్ర మల్లు ఆదివారం నిర్వహించిన టిజి -20 ఆటగాళ్ల వేలం లో ఖమ్మం ఏసెస్ జట్టుకు ఎంపిక కావడం ఎంతో ఆనందదాయకం.రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ వేలంలో సహేంద్ర మల్లు ఎంపిక కావడం, అలాగే ఖమ్మం జట్టు తరపున బరిలోకి దిగడం ఖమ్మం జిల్లా ప్రజలకు గర్వకారణం.సహేంద్ర మల్లు ని క్రీడల వైపు ప్రోత్సహించి, ఆయన ప్రతిభను వెలికితీసిన తల్లిదండ్రులు మల్లు భట్టి విక్రమార్క, నందిని విక్రమార్క కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.శసహేంద్ర మల్లు భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి, ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ప్రారంభమైన 'యోగాంధ్ర' కార్యక్రమం



విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం ఉదయం "యోగాంధ్ర" ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మహా మండపం 6వ అంతస్తులో ప్రముఖ యోగా అధ్యాపకులు గర్రె రాజేష్ ఆధ్వర్యంలో ఉదయం 7:00 గంటల నుండి 8:00 గంటల వరకు నిర్వహించబడింది. దేవస్థాన సిబ్బంది, అర్చకులు, పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఆయన యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొని సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు నిలయాలైన దేవాలయాలకు, మనస్సును ప్రశాంత పరిచే యోగాధ్యయనానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని ఆయన వివరించారు.ఈ నెల 21 వరకు ప్రతి రోజు ఉదయం నిత్యం దేవాలయంలో జరిగే ఈ ఉచిత యోగా కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీనిని విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు.యోగాంధ్ర ప్రారంభ కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పెనుమత్స రాఘవరాజు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులందరికీ దేవస్థానం తరపున ఉచిత ప్రసాదాలు, మంచినీరు పంపిణీ చేశారు.

## భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి



విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచే భక్తుల రాక విపరీతంగా పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు డీఈఓ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పర్యవేక్షణలో ఆలయ ఏఈవోలు చంద్రశేఖర్ ,వెంకటరెడ్డి ,రమేష్ క్యూలైన్లు పర్యవేక్షణ చేసి, భక్తులకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేశారు.రద్దీ భారీగా పెరగడంతో, సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు ఉదయం 9 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల క్యూ లైన్లలోని సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సులభంగా లభించింది.ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సరికొత్త నీటి సరఫరా విధానాన్ని ప్రవేశపెట్టారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తుల వద్దకే సరికొత్త మొబైల్ వాటర్ క్యాన్ల ద్వారా చల్లని తాగునీటిని అందించారు. ఆలయ పరిసరాల్లో ఉచిత ప్రసాదం, అన్నదానం పంపిణీ చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు క్యూ లైన్లలోని భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులతో కలిసి ఉంటూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ రంగా రావు, ఇన్‌చార్జ్ ఈఓ, సిబ్బందితో కలిసి క్యూ లైన్లను క్రమబద్ధీకరించేందుకు శ్రమించారు.పాలకమండలి, అధికారుల సమన్వయంతో భారీ రద్దీలోనూ భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరిగింది.

## పారాక్వాట్ పచ్చని పొలాల్లో మృత్యుపాశం విరుగుడు లేని విషానికి 'నిషేధం 'ఎప్పుడు

### గడ్డి మందు కాదు, ప్రాణాలను హరించే కాలకూట విషం



గార్లదిన్నె, నేటి శుభోదయ ::: రైతన్న కష్టంతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు, నేడు ఒక భయంకరమైన విషపు నీడలో చిక్కుకున్నాయి. కలుపు మొక్కలను చంపడానికి వాడే పారాక్వాట్ అనే రసాయనం, కేవలం గడ్డిని మాత్రమే కాదు. రైతన్నల ప్రాణాలను కూడా నిశ్శబ్దంగా బలి తీసుకుంటోంది.పొలాల్లో కొట్టే ఈ మందు, నేడు పల్లెటూరి ప్రాణాలకు ఒక ఉరితాడులా మారుతోంది. ఈ విషానికి విరుగుడు లేకపోవడం వల్ల, క్షణికావేశంలో దీనిని తాగిన వారు ప్రాణాలు కాపాడుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. 70 దేశాలు ఇప్పటికే దీనిని తరిమికొట్టినా, మన దగ్గర ఇంకా విచ్చలవిడిగా అమ్ముతుండటం విచారకరం.

క్షణికావేశం, ఆపై మృత్యువుతో పోరాటం

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి మనస్పర్థలు, అప్పుల బాధ లేదా కుటుంబ కలహాలు కారణం ఏదైనా కావచ్చు, క్షణికావేశంలో రైతు చేతికి చిక్కేది పొలంలో ఉండే ఈ గడ్డి మందే.

– నిస్సహాయత


"నన్ను కాపాడండి, నా పిల్లలు ఏమైపోతారు?" అని బాధితులు ఆసుపత్రిలో వేడుకుంటున్నా, వైద్యులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి.

– విరుగుడు లేదు ప్రపంచవ్యాప్తంగా ఈ విషానికి ఇప్పటికీ సరైన విరుగుడు కనుగొనబడలేదు. ఇది శరీరంలోకి వెళ్ళిందంటే మరణ శాసనం రాసుకున్నట్టే.

– ఊపిరిని బంధించే కర్కశత్వం

పారాక్వాట్ శరీరంలోకి ప్రవేశించాక అత్యంత క్రూరంగా ప్రవర్తిస్తుంది:

– పల్మనరీ ఫైబ్రోసిస్ ఊపిరితిత్తుల కణజాలాన్ని రాయిలా గట్టిపడేలా చేస్తుంది. బాధితుడు స్పృహలో ఉన్నా, గాలి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతూ ప్రాణాలు వదులుతాడు.




– అవయవాల వైఫల్యం

ఊపిరితిత్తులతో పాటు కిడ్నీలు, కాలేయం క్రమంగా కుప్పకూలుతాయి.

నరకయాతన: ఈ విష ప్రభావం వల్ల మనిషి వెంటనే చనిపోడు; రోజులు లేదా వారాల పాటు నరకాన్ని అనుభవిస్తూ మృత్యువు వైపు సాగుతాడు.

– ప్రపంచం వద్దన్నా మనకెందుకు ఈ మొండితనం

ఈ రసాయనం యొక్క తీవ్రతను గుర్తించి బ్రిటన్, స్విట్జర్లాండ్, చైనా, యూరోపియన్ యూనియన్ సహా సుమారు 70కి పైగా దేశాలు దీనిని పూర్తిగా నిషేధించాయి.మన దేశంలో కొన్ని పంటలకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటల్లో విచ్చలవిడిగా వాడుతున్నారు.లైసెన్సు నిబంధనలు ఉన్నా, క్షేత్రస్థాయిలో నియంత్రణ లేకపోవడంతో ఇది కిరాణా కొట్టులో వస్తువులా సులభంగా లభిస్తోంది.

నేలతల్లికి కూడా తీరని నష్టం

ఇది కేవలం మనుషులకే కాదు, పర్యావరణానికి కూడా గొడ్డలి పెట్టు:జీవవైవిధ్యం: భూమిలో మేలు చేసే వానపాములు,

సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది.

కలుషితం: వర్షపు నీటితో కలిసి బావులు, చెరువుల్లోకి చేరి నీటి వనరులను విషతుల్యం చేస్తోంది.

ఆహార భద్రత: పంటల ద్వారా ఈ రసాయన అవశేషాలు మనం తినే ఆహారంలోకి చేరి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి.

– పరిష్కారం దిశగా అడుగులు

కలుపు నియంత్రణకు పారాక్వాట్ ఒక్కటే మార్గం కాదు. సురక్షితమైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి:

కలుపు తీసే చిన్నపాటి యాంత్రిక పరికరాలు .మల్చింగ్ పద్ధతులు మరియు అంతర పంటల సాగు.సహజ సిద్ధమైన కలుపు నివారణ పద్ధతులు.

– నియంత్రణ కాదు, నిషేధమే శరణ్యం తెలంగాణ ప్రభుత్వం పారాక్వాట్ విక్రయాలపై ఇటీవల కొన్ని ఆంక్షలు విధించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. కేవలం 'నియంత్రణ' తో సరిపెట్టుకుంటే చాలదు, 70 దేశాలు ఇప్పటికే తరిమికొట్టిన ఈ కాలకూట విషంపై 'సంపూర్ణ నిషేధం' విధించడమే సబబు.

– కఠిన చర్యలు వ్యవసాయ అధికారుల రాతపూర్వక అనుమతి (లేనిదే ఏ ఒక్క లీటరు మందు కూడా విక్రయించకుండా విక్రయ కేంద్రాలపై ఉక్కుపాదం మోపాలి.ప్రత్యామ్నాయ సాగు: గడ్డి మందుపై ఆధారపడకుండా, కలుపు నివారణకు వాడే యాంత్రిక పరికరాలపై రైతులకు భారీగా సబ్సిడీలు అందించి ప్రోత్సహించాలి.

– అవగాహన కల్పించాలి

ఈ రసాయనం వల్ల కలిగే ప్రాణాపాయంపై గ్రామస్థాయిలో రైతులకు, వారి కుటుంబాలకు విస్తృత అవగాహన కల్పించాలి.

పారాక్వాట్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడం ద్వారానే మన అన్నదాతను, నేలతల్లిని కాపాడుకోగలం. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని, నియంత్రణల నుంచి నిషేధం దిశగా అడుగులు వేయాలి!– డా. ఆర్ఎస్ఎస్ స్వతంత్ర శాస్త్రవేత్త రామిశెట్టి శివశంకర్,చైర్మన్, డా. ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు.. ప్రతి ఇంటికి సోలార్ వెలుగు బొండా సిద్దార్థ




విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-33వ డివిజన్ సత్యనారాయణపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం క్లస్టర్ ఇన్‌చార్జీలు, డివిజన్ కమిటీలు, బూత్ లెవల్ ఏజెంట్లతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు, ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బొండా సిద్దార్ధ మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే చారిత్రాత్మక ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం, అనర్హుల పేర్లు తొలగించడం, ప్రతి ఓటు విలువను కాపాడడం ప్రతి కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు.కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత, మహిళలు, ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులందరినీ గుర్తించి ఓటరు జాబితాలో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సిద్దార్ధ సూచించారు. అదే సమయంలో డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లను గుర్తించి తొలగించేందుకు బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాపై అవగాహన కల్పించాలని, ఫారం-6, ఫారం-7, ఫారం-8 వినియోగంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని సిద్దార్ధ సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అర్హత ఉన్న ఒక్క వ్యక్తి కూడా ఓటరు జాబితా నుండి మినహాయింపుకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.నా×= కార్యక్రమం కేవలం ఓటరు జాబితా సవరణ మాత్రమే కాదని, రాబోయే తరాల ప్రజాస్వామ్య భవిష్యత్తుకు పునాది వేసే మహత్తర కార్యక్రమమని సిద్దార్ధ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముందుండాలని ఆకాంక్షించారు.అదేవిధంగా సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని తెలిపారు, ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంతో పాటు స్వయం సమృద్ధి సాధించవచ్చని వివరించారు.ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలే తమ ఇళ్లలో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, అనంతరం ఇంటింటికి వెళ్లి సోలార్ శక్తి ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, విద్యుత్ ఆదా అవకాశాలపై అవగాహన కల్పించాలని సిద్దార్ధ సూచించారు.సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో క్లస్టర్ వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, సోలార్ శక్తి వినియోగంపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో చేర్చడం ద్వారా ప్రజా సేవలో ముందుండాలని సిద్దార్ధ కోరారు.ఈ కార్యక్రమం లో క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మలపెంట శ్రీనివాస్, కో క్లస్టర్ గార్లపాటి విజయ్ కుమార్, ఈ డివిజన్ అధ్యక్షులు నాలం కోటేశ్వరరావు తదితర డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగమనేని రమేష్ ను కలిసి శుభాకాంక్షలు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపిన అక్కల రామ మోహన్ రావు



విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-జనసేన పార్టీ రాజసభ సభ్యులు గా నియమించిన లింగమనేని రమేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గం ఇన్ ఛార్జ్ అక్కల రామ మోహన్ రావు(గాంధీ),అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## 3వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను సందర్శించిన ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె




విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-అన్ని వయస్సుల వారు ఉత్సాహంగా ఆడే క్రీడ పికిల్ బాల్ అని, అలాంటి పికిల్ బాల్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీలను నగరంలోని నిర్వహించడం అభినందనీయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. భారతీ నగర్‌లోని నెట్రో పికిల్ బాల్ కేఫ్ ఆవరణలో మూడవ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, సుజయ రంగారావు పాల్గొన్నారు.ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ పికిల్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నగరంలో జరగడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పికల్ బాల్ క్రీడకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ పొందుతోందని వెల్లడించారు. ఎమ్మెల్యే గద్దె అంటేనే క్రమశిక్షణ అని ఆయన ప్రతి రోజూ వాకింగ్, రన్నింగ్‌తో పాటుగా వ్యాయామం చేస్తారని చెప్పారు. ఇటువంటి గేమ్స్‌ను నగరానికి తీసుకువచ్చిన గద్దె క్రాంతిని ఆయన అభినందించారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ పికిల్ బాల్ 3వ రాష్ట్ర స్థాయి పోటీలను నగరంలోని నిర్వహించడం అభినందనీయమన్నారు. పికిల్ బాల్ అనేది అన్ని వయస్సు వారు ఆడవచ్చునని చెప్పారు. పోటీల నిర్వహలను అభినందించారు.అటవీశాఖ ఛైర్మన్ సుజయ రంగారావు మాట్లాడుతూ 3వ ఏపీ స్టేట్ పికిల్ బాల్ ఛాంపియన్ షిప్ కు ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. చాలా వేగవంతంగా ఈ క్రీడ అభివృద్ధి చ

## ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక




విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.


## యోగాంధ్ర 2026 ఘనంగా ప్రారంభం

**– ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం: వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు, యోగాంధ్ర--2026 కార్యక్రమం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో అంగరంగ వైభవంగా ప్రారంభమైనట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర--2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమం తొలి రోజున విజయవాడ నగరంలోని రివర్ ఫ్రంట్ పార్క్ , కృష్ణలంక , భవానీపురం , అలాగే ఙతీ. బి .ఆర్ . అంబేద్కర్ స్మృతివనం (ఎంజీ రోడ్) ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు.యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి, సానుకూల దృక్పథం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని యోగాలో శిక్షణ పొందాలని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకుని ఆరోగ్యవంతులుగా, ఆనందంగా జీవించాలని కమిషనర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు.నగరంలోని ముఖ్యమైన పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ రానున్న రోజుల్లో కూడా నగరంలోని వివిధ ప్రాంతాల్లో యోగాంధ్ర--2026 కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించి, ఎక్కువ మంది ప్రజలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు యోగా ఒక ఉత్తమ సాధనమని, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యోగాంధ్ర కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

## శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి విచ్చేసిన చింతకాయల విజయ్ కుటుంబం



విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-చింతకాయల విజయ్ రాజ్యసభకు ఎంపికైన సందర్భంగా భార్య,కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. తన నూతన రాజకీయ ప్రస్థానం విజయవంతం కావాలని, ప్రజాసేవలో ముందుకు సాగేందుకు శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని బహుకరించారు.

## అలరించిన "సంగీత రాత్రి"- స్వరధునికి ఘనంగా గళార్చన





ఖమ్మం కల్చరల్, నేటి శుభోదయ ::: స్వరమాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యంలో ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం ఎస్పీ బాలు 80 వ జయంతి సందర్భంగా ఆయన పాడిన పాటలతో గాయకులు ఘన నివాళులర్పించారు

గాయనీగాయకులు వంజా మాలతి నాయుడు,ఆరేపల్లి పున్నయ్య,ఎస్. ప్రకాష్, ఎస్వీ రమణ, స్వప్న, శ్రీదేవి, స్నేహ, ఎం.నాగభూషణం, జనార్ధన్, కామేశ్వరావు, రామకృష్ణ, మోజీ, ఆలపించిన గీతాలు ప్రేక్షకులను అలరించాయి. స్వరమాధురి అధ్యక్షుడు ఆదిరాజు పురుషోత్తమరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.పుసులూరి శ్రీలత వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## నేడే పాలమాకుల గ్రామానికి అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రాక

**:కోడి గంటి చంద్రారెడ్డి.**



రాజేంద్ర నగర్,జూన్07(నేటి శుభోదయ):పాలమాకుల గ్రామానికి అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతులు మీదుగా నిర్వహించడం జరుగుతుందా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోడి గంటి చంద్ర రెడ్డి సూచించారు.శంషాబాద్ మండల మాజీ జడ్పిటిసి,మాజీ వైస్ ఎంపీపీ,సర్పంచ్లకు,మాజీ ఎంపీటీసీలు,పిఎసిఎస్ చైర్మన్ లు,డైరెక్టర్లు,వార్డు సభ్యులు,పార్టీ పదాధికారులకు,సీనియర్ నాయకులకు,మీడియా మిత్రులకు,పత్రికా సోదరులకు,ప్రాణ సమానమైన పార్టీ కుటుంబ సభ్యులందరికీ పార్టీ సందేశం ఏమనగా నేడు ఉదయం10.00 గంటలకు పాలమాకుల గ్రామంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించబడుతుందని శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే చంద్రారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్ పాల్గొనుచున్నారు.కావున పైన తెలిపిన పార్టీ పదాధికారులు,నాయకులు,కార్యకర్తలు రావాల్సిందిగా కోరుతూ సమయపాలన పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము అని పార్టీ సీనియర్ నాయకులు కే చంద్రారెడ్డి కోరారు.

### 16వ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**-బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడాక మూడు డివిజన్లు కలిపి మండలం ఏర్పాటు**




వరంగల్ ప్రతినిధి, జూన్ 07 (నేటి శుభోదయ):దేశంలో గుణాత్మకమైన మార్పును సాధించే దిశగా బీఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు పురోగమించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మ రెడ్డి పిలుపునిచ్చారుగ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ లో ధర్మారం,జాన్‌పాక గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌కు వెన్నెముకలాంటివారని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 15వ,16,17వ డివిజన్లను మరియు సమీప ప్రాంతాలను కలుపుకుని ధర్మారాన్ని మండల కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.ప్రజల పరిసరాల రీత్య వరంగల్ నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెరగనున్న సర్కిళ్లను దృష్టిలో పెట్టుకొని ధర్మారం కి సర్కిల్ మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తానని అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వమే భరోసా అని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందని, రానున్న రోజుల్లో ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ అనుబంధ కమిటీల ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ



విజయవాడ, జూన్ 7 (నేటి శుభోదయ):-శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం లో ఆదివారం ఉదయము సూర్యోపాసన సేవ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. లోక కల్యాణార్థం, భక్తుల క్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులందరూ పాల్గొని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు అరుణ పారాయణం, మహాసౌర పారాయణం, సూర్య అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు చేశారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం సూర్యోపాసన వల్ల ఆరోగ్యం, తేజస్సు, మానసిక ప్రశాంతత లభిస్తాయని పండితులు తెలిపారు. ముఖ్యంగా ఆదివారం సూర్యుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఈ సేవకు విశేష ప్రాధాన్యతఉంది. సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సూర్యోపాసన వంటి ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు వెబ్‌సైట్ (ఝఝఝుబతీస్త్రఝఎఝ.శీతీస్త్ర) ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చని ఈఓ తెలిపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చక బృందం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిత్యుని కృపకు పాత్రులయ్యారు.

## వ్యక్తిగత ఇష్టాలకు, మార్కెట్ డిమాండ్ కు కెరీర్ ఎంపిక లో ప్రాధాన్యత ఇవ్వాలి



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) కెరీర్ ను ఎంపిక చేసుకునేటప్పుడు వ్యక్తిగత ఇష్టాలకు, నైపుణ్యాలకు, మార్కెట్ డిమాండ్ కు, కుటుంబ ఆర్థిక పరిస్థితికి ప్రాధాన్యత ఇవ్వాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక వి.మాడుగులలోని విలియం మేయర్ డెవలప్మెంట్ సొసైటీలో సెయింట్ ఆన్స్ సంస్థ ఏర్పాటుచేసిన కెరీర్ కౌన్సిలింగ్ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ- కెరీర్ అంటే కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాదని, జీవితకాలంలో ఒక పని చేయడంలో సంపాదించే అనుభవం, పేరు- ప్రఖ్యాతులు, విజయాలు అని అన్నారు. ప్రజల కెరీర్ మీదే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని అన్నారు. పదవ తరగతి తరువాత, ఇంటర్మీడియట్ తర్వాత ఎటువంటి కెరీర్ అవకాశాలు ఉన్నాయో ఆమె సవివరంగా తెలియజేశారు. కార్యక్రమానికి విలియం మేయర్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ సిస్టర్ సాజిత అధ్యక్షత వహించగా, కార్యక్రమం లో పెద్ద సంఖ్యలో యువత, స్థానిక మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## "క్రికెట్ ఆడేవాడు కుస్తీ ఏంటి కుస్తీ నుంచి మళ్ళీ రన్నింగ్ ఏంటి"




హైదరాబాద్, నేటి శుభోదయ :: ప్రస్తుతం సోషల్ మీడియాలో, సినిమా సర్కిల్స్‌లో 'పెద్ది' సినిమా కథాంశంపై కొంతమంది నెటిజన్లు ఏదో ఎగతాళిగా పోస్ట్‌లు పెడుతున్నారు. ఒకే వ్యక్తి విభిన్న క్రీడల్లో రాణించడం అసాధ్యమనే కోణంలో ట్రోలింగ్ చేస్తున్నారు. కానీ, క్రీడా చరిత్రను ఒక్కసారి తిరగేస్తే, ఇలాంటి మార్పులు కేవలం సాధ్యమే కాదు. చరిత్రలో అద్భుతాలు సృష్టించాయని స్పష్టమవుతుంది. సినిమా అనేది సమాజానికి లేదా నిజ జీవితానికి ప్రతిబింబం. ఒక పాత్ర ఒక రంగం నుంచి మరొక రంగానికి మారినప్పుడు దాని వెనుక బలమైన కారణాలు, శారీరక సామర్థ్యం ఉంటాయి.రామ్ చరణ్ చేసిన 'పెద్ది' పాత్రను ఎగతాళి చేసే వారు ఒక క్రీడాకారుడి ప్రతిభను, పట్టుదలను తక్కువగా అంచనా వేస్తున్నట్లే లెక్క. ప్రపంచవ్యాప్తంగా ఒక ఆటలో అగ్రస్థానంలో ఉండి, ఆ తర్వాత పూర్తిగా భిన్నమైన మరొక ఆటలోకి ప్రవేశించి సంచలనాలు సృష్టించిన మహామహులు ఎందరో ఉన్నారు. వారి గురించి తెలిస్తే 'పెద్ది' పాత్ర తీరుతెన్నుల గురించి ఎవరూ కామెంట్ చేయడానికి సాహసించరు. అలాంటి మల్టీ స్పోర్ట్స్ పర్సన్స్ విషయానికి వస్తే..

**- ఆండ్రూ ఫ్లింటాఫ్**

ఇంగ్లాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రతిభావంతుడైన ఆల్ రౌండర్లలో ఆండ్రూ ఫ్లింటాఫ్ ఒకరు. యాషెస్ సిరీస్ హీరోగా, మైదానంలో పరుగుల వరద పారించి, వికెట్లు పడగొట్టిన ఈ స్టార్ ఆల్ రౌండర్, క్రికెట్‌కు గుడ్ బై చెప్పిన తర్వాత ఏం చేశాడో తెలుసా? అందరినీ ఆశ్చర్యపరుస్తూ ప్రొఫెషనల్ హెవీవెయిట్ బాక్సర్‌గా రింగ్ లోకి అడుగుపెట్టారు. కఠినమైన శిక్షణ తీసుకుని, బాక్సింగ్‌లో కూడా తన పవర్ ఏంటో నిరూపించుకున్నారు.

**- జాంటీ రోడ్స్**

క్రికెట్ ప్రపంచంలో 'ఫ్లయింగ్ సౌతాఫ్రికన్'గా పేరుగాంచిన జాంటీ రోడ్స్ ఫీల్డింగ్ విన్యాసాలు అందరికీ గుర్తే. మైదానంలో చిరుతపులిలా దూకుతూ రనౌట్లు, క్యాచ్‌లు పట్టే జాంటీ రోడ్స్, కేవలం క్రికెటర్ మాత్రమే కాదు, ఒక అద్భుతమైన హాకీ ప్లేయర్ కూడా. 1996 సౌతాఫ్రికా హాకీ ప్లేయర్‌గా ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించిన రికార్డు కూడా ఆయనకు ఉంది. ఒక అంతర్జాతీయ స్థాయి అథ్లెట్ ఏ క్రీడలోనైనా రాణించగలడనడానికి జాంటీ రోడ్సే సాక్ష్యం.ఇక 'పెద్ది' విషయానికి వస్తే, ఊర్లో సరదాగా ఫ్రెండ్స్‌తో కలిసి క్రికెట్ ఆడే ఒక సాధారణ యువకుడు. అతనిలో సహజంగానే ఒక మంచి అథ్లెట్ ఉన్నాడు. తన శారీరక బలాన్ని, పట్టుదలను గుర్తించి, అత్యంత కఠినమైన, సాంప్రదాయ క్రీడ అయిన 'కుస్తీ'ని సీరియస్‌గా నేర్చుకుంటాడు. కుస్తీలో రాణించాలంటే అపారమైన స్టామినా, మైండ్ గేమ్ అవసరం. క్రీడాకారుల జీవితాల్లో గాయాలు చాలా సహజం. ఈ క్రమంలో ఒక ఆటగాడికి కాలు సహకరించకపోతే కెరీర్ ముగిసిపోయిందని అందరూ అనుకుంటారు. కానీ, గుండె నిండా పట్టుదల ఉన్నవాడు ఆగిపోడు. కుస్తీకి అవసరమైన భారీ కండరాల బలం తగ్గినా, తనలో ఉన్న రన్నింగ్ సామర్థ్యాన్ని నమ్ముకుని ఆ వైపు అడుగులు వేస్తాడు. ఇది కేవలం సినిమా కథ కాదు. గాయాల వల్ల తమ క్రీడలను మార్చుకుని ఒలింపిక్స్‌లో మెడల్స్ గెలిచిన ఎందరో రియల్ హీరోల కథ. ఒక క్రీడాకారుడికి బేసిక్ ఫిట్‌నెస్, రన్నింగ్ సామర్థ్యం, మానసిక దృఢత్వం ఉంటే అతను ఏ క్రీడనైనా త్వరగా అందిపుచ్చుకోగలడు.కాబట్టి, స్క్రీన్ మీద 'పెద్ది' చేసే ప్రయాణాన్ని లాజిక్ లేనిదిగా భావించి ఎగతాళి చేసే వాళ్లంతా ముందుగా క్రీడా చరిత్రను, ఒక అథ్లెట్ యొక్క శారీరక పరిణామ క్రమాన్ని తెలుసుకోవాలి. నిజ జీవితంలో ఆండ్రూ ఫ్లింటాఫ్, జాంటీ రోడ్స్ వంటి వాళ్ళు చేసిన విన్యాసాలనే మన నేటివిటీకి, ఎమోషన్స్‌కు జోడించి 'పెద్ది' పాత్ర రూపంలో థియేటర్లలోకి తీసుకొచ్చారు. ఆ పాత్రకు గౌరవం ఇవ్వకపోయినా పర్లేదు కానీ, ఎగతాళి మాటలతో కామెంట్స్ చేయడం ఆపండి మరి.

## మహిళలకు 33% రిజర్వేషన్ల విషయమై మాట తప్పిన నారా లోకేష్..!!

**రాజ్యసభ కు ఒక్క మహిళను కూడా ఎంపిక చేయకపోవడం దారుణం**

**ఇప్పటికే స్పీకర్ గా ఉన్న అయ్యన్నపాత్రుడి కుమారుడికి రాజ్యసభ స్థానం ఎందుకు**

**నారా లోకేష్ అనాలోచిత నిర్ణయాలు వల్ల భవిష్యత్తులో పార్టీ మనుగడకే ప్రస్నార్థకం**

**జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది**

**- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ సంచలన వ్యాఖ్యలు**



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం: మహిళలకు 33% రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ కేవలం తొమ్మిది రోజుల్లోనే మాట తప్పారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆరోపించారు. ఆదివారం ఉదయం జీవీఎంసీ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆయన మీడియాతో ఇదే విషయమై మాట్లాడుతూ.. రాజ్యసభకు నాలుగు స్థానాలు కేటాయించాల్సి ఉండగా ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించారన్నారు. మిగిలిన మూడు స్థానాలలో తెలుగు దేశం పార్టీకి చెందిన అగ్రవర్ణ వ్యక్తులకే సీట్లు కేటాయించడం దారుణం అని వ్యాఖ్యనించారు. తమకు 33% రిజర్వేషన్ అని లోకేష్ ప్రకటించిన వెంటనే అతని ఫోటోలకు క్షీరాభిషేకాలు చేసిన మహిళలు ఇప్పుడు లోకేష్ వైఖరిపై ఎలా స్పందిస్తారో చూడాలన్నారు.ఇదిలా ఉండగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడి కుమారుడికి సీటు కేటాయింపు పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మొత్తం మీద చూసినట్లయితే కేవలం లోకేష్ టీమ్ కే చెందిన ముగ్గురే వ్యక్తులకు రాజ్యసభ సీట్లు కేటాయించడం బట్టి పార్టీలో చంద్రబాబు నాయుడు టీమ్ ప్రాబల్యం తగ్గుతున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నదని పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఉన్న నారా లోకేష్ అనాలోచిత నిర్ణయాలు భవిష్యత్తులో ఆ పార్టీ మనుగడకే ప్రస్నార్థకం చేస్తాయని హెచ్చరించారు. గతంలో తెలంగాణలో తెలుగు దేశం పార్టీ పతనం కావడానికి లోకేష్ కారణమని ఆరోపించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని.. ఈ నేపథ్యంలో 2029 ఎన్నికలలో పార్టీ ఓటమి ఖాయమని అంచనా వేశారు. తెలుగుదేశం పార్టీని విపత్కర పరిస్థితుల నుంచి కాపాడాలంటే అన్న నందమూరి తారక రామారావు వారసుడు.. జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అమరావతి మహిళకు సీటు కేటాయించాలి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లలో భాగంగా వెంటనే మహిళకు రాజ్యసభ సీటు కేటాయించాలని అది కూడా అమరావతి ప్రాంతానికి చెందిన మహిళకు కేటాయించాలన్నారు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోసం ఐదు సంవత్సరాల పాటు గత ప్రభుత్వ హయాంలో మహిళలు వీరోచితమైన పోరాటం చేశారన్నారు. ఆ మహిళల పోరాటానికి గుర్తింపు దక్కాలంటే అమరావతి ప్రాంతానికి చెందిన మహిళకు ఖచ్చితంగా రాజ్యసభ సీటును కేటాయించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అదేవిధంగా ఒక స్థానాన్ని తప్పనిసరిగా బీసీ అభ్యర్థులకు కేటాయించాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు. వంగవీటి రాధాను విస్మరించారా కాపు కుల సింహం వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధాను విస్మరించారా అని బి.వి.రామ్ ప్రశ్నించారు. వంగవీటి రాధాకు తగిన రాజకీయ ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన టీడీపీ ఇప్పుడు రాజ్యసీట్ల కేటాయింపులో మొండి చేయి చూపిందని రామ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో సానా సతీష్ కు కేటాయించిన రాజ్యసభ స్థానాన్ని వంగవీటి రాధాకు ఇవ్వాలని తెలుగు శక్తి డిమాండ్ చేస్తోందన్నారు.



## కేతగుడిపిలో 36 మందికి పైగా కాంగ్రెస్‌లో చేరిక

**డాక్టర్ షేక్ మహబూబ్ వలి సారథ్యంలో కార్యక్రమం**

మార్కాపురం/తర్లపాడు,జూన్ 07(నేటి శుభోదయ):ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా తర్లపాడు మండలం కేతగుడిపి గ్రామంలో ఆదివారం 36 మందికి పైగా వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.కేతగుడిపి గ్రామ ప్రజలు డాక్టర్ షేక్ మహబూబ్ వలిని ఆహ్వానించి, ఆయన సారథ్యంలో కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు, దృశలువలు వేసి ఘనంగా సత్కరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా డాక్టర్ షేక్ మహబూబ్ వలి బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలు,పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని గమనిస్తున్నామని పేర్కొన్నారు.ఆయన నాయకత్వంలో తమ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.పార్టీలో చేరిన వారిలో బేతం కొండయ్య,బేతం, జాను, బేతం దానియేలు, సంతోష్,చిన్న గురవయ్య, కమలమ్మ, సెలో మీరు, గురవయ్య, బేతం పీటర్, గురువమ్మ,వెంకట స్వామీ,డోలు కోటయ్య,కాటకాల బల్కాసయ్య, ఇలియాక గలయ, కాటకాల బాలయ్య, ప్రశాంతి, సుశీలమ్మ, చిన్నయ, కే కాస్యమ్మ,జన్నిపోగు ఏసు,ం గీతం కాశయ్య,పి సన్నీ, పి సామెల్, నయొమని, బేతం కమనీ, బేతం కోటయ్య తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమాన హక్కులు,గౌరవం కల్పిస్తుందని అన్నారు.పార్టీలో ఆధిపత్యం ఎవరి చేతిలోనూ ఉండదని,ప్రతి సామాన్య కార్యకర్తకు కూడా గౌరవప్రదమైన బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసేవారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు.రానున్న రోజుల్లో జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో తమ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున చేరికల కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు.బీజేపీ పాలనపై ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలోని ఇతర పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నందున మైనారిటీలు, దళితులు, బడుగు బలహీన వర్గాలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మహబూబ్ సుభాని,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు







## మళ్లీ సిఎన్‌జి ధరల పెంపు ..!





న్యూఢిల్లీ : కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సిఎన్‌జి ధరలను మరోసారి పెంచింది. కిలో సిఎన్‌జి పై రూపాయి పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుండే అమలులోకి వచ్చాయి. ఈ తాజా పెంపుతో ఢిల్లీలో సిఎన్‌జి ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సిఎన్‌జి ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా, అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సిఎన్‌జి ధరలు పెరిగినట్లయింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదే పదే ప్రకటించిన కేంద్రం ... ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం రోజున పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

## ఇంటర్నెట్ పునరుద్ధరణ ఇరాన్ అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ

టెహ్రాన్ : అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఇరాన్‌లో గత కొన్ని నెలలుగా ఇంటర్నెట్ నిలిచిపోయింది. తాజాగా ఇంటర్నెట్ కనెక్టివిటీపై విధించిన ఆంక్షలను సమీక్షించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక సైబర్‌స్పేస్ టాస్క్‌ఫోర్స్ తీసుకున్న నిర్ణయం మేరకు, రాబోయే రోజుల్లో ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ సదుపాయాన్ని పునరుద్ధరించే ప్రణాళికలను ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇప్పటికే ఇంటర్నెట్ సదుపాయాన్ని పునఃప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వ ప్రతినిధి ఫాతిమా మొహజెరానీ మంగళవారం మీడియా సమావేశంలో అన్నారు. కాగా, రాబోయే రోజుల్లో ప్రజల న్యాయమైన హక్కు అయిన ఇంటర్నెట్ సదుపాయాన్ని పునరుద్ధరించగలమని ఆశిస్తున్నాము అని అధ్యక్షుడు డిఫెన్స్ మ్యూజియం గార్డెన్‌లో జరిగిన మీడియా సమావేశంలో అన్నారు. దాదాపు 87 రోజులకి పైగా అక్కడ ఇంటర్నెట్ నిలిచిపోయింది.

## నేపాల్ ఆర్ఎస్‌పి చైర్మన్ లమిచానేతో ప్రధాని మోడీ భేటీ



న్యూఢిల్లీ : నేపాల్‌లో అధికారంలో ఉన్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ చైర్మన్ రబీ లామిచ్ఛనే ప్రధాని మోడీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో విదేశాంగ శాఖామంత్రి ఎస్. జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రిలు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా ఉమ్మడి, సుసంపన్నమైన భవిష్యత్తు కోసం కలిసికట్టుగా పనిచేయాలన్న రబీ ఆకాంక్షను నేను స్వాగతిస్తున్నాను. మా పొరుగు దేశాల భాగస్వామ్యానికి వస్తే.. నేపాల్ మాకు ప్రధాన భాగస్వామి. భారత్ -- నేపాల్ మధ్య ఉన్న ఈ విశిష్టమైన, బహుముఖ సంబంధాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు మేము నేపాల్‌లోని కొత్త ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాము' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## మమతాకు షాక్ : 58 ఎమ్మెల్యేలు తిరుగుబాటు

కోల్‌కతా : మమతాబెనర్జీకి భారీ షాక్ తగిలింది. టిఎంసి పార్టీలో చీలిక వచ్చింది. 58 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీపై తిరుగుబాటు చేశారు. టిఎంసి నిర్ణయాన్ని ఖాతరు చేయకుండా తిరుగుబాటు ఎమ్మెల్యేల తరపున అసెంబ్లీ ప్రతిపక్షనేతగా రితబ్రతా బెనర్జీని గుర్తించాలని అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ తిరుగుబాటు ఎమ్మెల్యేలందరికీ పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా నాయకత్వం వహిస్తున్నారు. వీరందరినీ ఆయనే ప్రత్యేక బస్సులో అసెంబ్లీ వద్దకు తీసుకెళ్లి స్పీకర్‌కు లేఖ కూడా సమర్పించారు. ఎమ్మెల్యేల మద్దతు ప్రకారం రితబ్రతానే అసెంబ్లీ ప్రతిపక్షనేతగా స్పీకర్ ప్రకటిస్తే.. అసెంబ్లీలో టిఎంసికి ప్రతిపక్ష హోదా కూడా ఉండదు. కాగా, టిఎంసి శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్షనేతగా ఎన్నుకోవడానికి మద్దతు ఇచ్చింది. అయితే టిఎంసి పార్టీలోని ఎమ్మెల్యేలు శోభన్‌దేవ్‌ని కాకుండా రితబ్రతను ప్రతిపక్షనేతగా మద్దతు ఇచ్చారు. దీంతో పశ్చిమబెంగాల్‌లో కొత్తగా ఈ పరిణామం ముందుకొచ్చింది.

## దేశపు బంగారాన్ని అమ్ముతున్నారా?

న్యూఢిల్లీ : డాలర్‌తో పోలిస్తే రూపాయి క్షీణిస్తోంది. ప్రస్తుతం డాలర్‌కు భారత కరెన్సీ విలువ 95 రూపాయలుగా ఉంది. ఈ నేపథ్యంలో దేశ విదేశీ మారక ద్రవ్య ఆస్తులను పరిరక్షించేందుకు భారతదేశపు బంగారు నిల్వల్లో కొంత భాగాన్ని విక్రయించిందన్న ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం కేంద్రాన్ని ప్రశ్నించారు. తాజాగా ఇరాన్ యుద్ధం వల్ల కలిగే పరిణామాల నుండి విదేశీ మారక ద్రవ్య ఆస్తులను కాపాడుకోవడానికి రిజర్వు బ్యాంకు తన బంగారు నిల్వల్లో కొంత భాగాన్ని విక్రయించి ఉండవచ్చని ఒక వార్తాకథనం వచ్చింది. ఈ కథనంపై కేజ్రీవాల్ స్పందించారు. మన దేశ ఆర్థిక పరిస్థితిపై కేంద్రం స్పష్టతనివ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'ఈ వార్త నిజమేనా? దేశపు బంగారాన్ని అమ్ముతున్నారా? ప్రభుత్వం అంతగా దివాళా తీసిందా? గత 76 ఏళ్లలో, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ దేశపు బంగారాన్ని ఎప్పుడూ అమ్మలేదు. ఇప్పుడు అమ్మింది అంటే పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని అర్థమా? ప్రభుత్వం మాకు ఎందుకు ఏమీ చెప్పడం లేదు? దేశ పరిస్థితి ఏమిటి?' అని కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏదన్నా సందర్భం వచ్చినప్పుడు మోడీజీ తన బ్యాగ్ సర్దుకుని వెళ్ళిపోతానని చెబుతుంటారు. కానీ మనం ఇక్కడే ఉండాలి, ఈ దేశంలోనే జీవించాలి అని కేజ్రీవాల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. జూన్ 3వ తేదీన మోనిటరీ పాలసీ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణం, విస్తృత ఆర్థిక పరిస్థితులపై చర్చ జరగనుంది. జూన్ 5వ తేదీన ఆర్‌బిఐ గవర్నర్ విధాన నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

## పెత్తనం చేస్తామంటే ఊరుకోం : పవన్ వ్యాఖ్యలపై కెటిఆర్

తెలంగాణ : 'నటుడిగా అభిమానిస్తాం.. సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం కానీ.. మా రాజకీయాల్లో పెత్తనం చేస్తామంటే ఊరుకోం- అని కెటిఆర్ హెచ్చరించారు. తెలంగాణపై ఎపి డిప్యూటి సిఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. దేశభక్తి, పోరాటాల గురించి తాము పవన్ కల్యాణ్ దగ్గర నేర్చుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. తెలంగాణ ఓజీ కెసిఆర్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కెటిఆర్ మాట్లాడుతూ మీడియావారు వేసిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. దేశంలో ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టుకోవచ్చని తెలిపారు. జనసేన కొత్తగా తెలంగాణలో పోటీ చేసేది ఏముందని అన్నారు. 2023 ఎన్నికల్లో బిజెపి తో కలిసి తెలంగాణలో పవన్ పోటీ చేశారని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను ఎవరూ అడ్డుకోలేదని.. ప్రజలే అడ్డుకున్నారని ఆయన స్పష్టం చేశారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదమని పవన్ కళ్యాణ్ అంటున్నారని... మరి మద్రాస్ నుంచి ఆంధ్ర వేరుపడాలని పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు ఆత్మబలిదానం చేసుకున్నారు కదా అది కూడా ప్రాంతీయ వాదం అంటారా ? అని ప్రశ్నించారు. ప్రాంతీయ వాదం అంటే తెలంగాణకి రావాల్సిన పెట్టుబడులు గుజరాత్‌లో పెట్టుకున్నారు.. మరి జాతీయవాదం ముసుగులో చేస్తున్న ఆర్థిక ప్రాంతీయ వాదం కరెక్టేనా ? అని నిలదీశారు. ప్రధాని మోడి కేవలం గుజరాత్‌కు పిఎంగా వ్యవహరించడం కరెక్టేనా అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదని గతంలో పవన్ కల్యాణ్ అన్నారని కెటిఆర్ తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం రోజు హైదరాబాద్‌కు వచ్చి సభ పెడతానంటే ఎలా ? అని ప్రశ్నించారు. దేశభక్తి గురించి పవన్ కల్యాణ్ తమకు నేర్పించాల్సిన అవసరం లేదని అన్నారు. తెలంగాణ భూమిపుత్రుల జాగీరే అని స్పష్టం చేశారు. 'నటుడిగా అభిమానిస్తాం.. సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం కానీ.. మా రాజకీయాల్లో పెత్తనం చేస్తామంటే ఊరుకోం- అని కెటిఆర్ హెచ్చరించారు. మొన్ననే అంత కష్టపడి విడిపోయాం కదా.. మళ్లీ మీ పెత్తనం ఎందుకు అని నిలదీశారు.

# చమురు ధర దిగొచ్చేదెలా?

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏం చెప్పినా హార్మూజ్ జలసంధి ఇప్పట్లో తెరుచుకో బోదని అందరికీ అర్థమైంది. అమెరికాకూ, ఇరాన్‌కూ మధ్య సాగుతున్న ఎడతెగని లడాయి పర్యవసానంగా ముడిచమురు, సహజవాయు దిగుమతులు అస్తవ్యస్తమై ఇంధన ధరలు తారస్థాయిలో పెరిగిపోతున్నాయి. మన దేశంలో కేవలం 11 రోజుల వ్యవధిలోనే ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ(ఓఎంసీ)లు నాలుగోసారి సోమ వారం ఉదయం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేశాయి. ఇంతవరకూ ఈ పెరుగుదల లీటర్‌కు సగటున రూ. 8 ఉంది. నిజానికి రూ.28 నుంచి రూ. 33 వరకూ పెంచితే తప్ప నష్టాల భర్తీ సాధ్యపడదని నిపుణులు సెలవిస్తున్నారు. అందులో సగమో, అంతకన్నా కాస్త తక్కువో పెంచకతప్పదనేది కూడా వారి మాటే. యుద్ధం మొదలైనాక వాటి ధరలు 30 శాతం పెరిగినా మన దేశంలో దాదాపు 74 రోజులపాటు ఓఎంసీలు 'పెద్ద మనసు'తో రూ. లక్షా 20 వేలకోట్లకుపైగా నష్టాన్ని భరించాయి. 'ఒక దేశం--పలు ఎన్నికలు' జనానికి చేసే మేలుగా దీన్ని చూడాలి! అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే చమురు ధరలు కళ్లెం తెంచుకున్న గుర్రం మాదిరి పరుగులంకించుకున్నాయి. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఫ్రీడమ్ 250' పేరిట శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఢిల్లీలో అమెరికా రాయబారిగా ఉంటున్న సెర్జియో గోర్ నేరుగా తమ అధ్యక్షుడు ట్రంప్‌కు ఫోన్ చేసి ఆ సంభాషణలు అందరికీ వినిపించారు. 'భారత్ నాపై వంద శాతం భరోసా పెట్టుకోవచ్చు. ఏ సాయం కావాల్సివచ్చినా ఎక్కడికి ఫోన్ చేయాలో వారికి తెలుసు' అంటూ ట్రంప్ చెప్పుకుపోయారు. 'నేను ప్రధాని మోదీకి పెద్ద ఫ్యాన్‌ను' అని కూడా అన్నారు. కానీ దురదృష్టమేమంటే మన చమురు కష్టాలకు ట్రంపే కారకుడు. తన నిర్వాకం ఫలితంగా ముడి చమురు, సహజవాయు ధరలు పెరిగి అన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటుతుంటే, ఆర్థిక వ్యవస్థలు పతనమవుతుంటే... చవగ్గా రష్యా అమ్మజూపే చమురు కొనడానికి వీల్లేదంటూ మూర్ఖపు ఆంక్షలు విధిస్తున్నది ఆయనగారే. మధ్యమధ్యన 'ఈ నెల్లాళ్లూ కొనుక్కోండి... ఈ రెండు వారాలూ ఓకే' అంటూ బిచ్చంవేస్తున్నట్టు సడలిస్తున్నదీ ఆయనే. ఇప్పుడైతే పూర్తి స్థాయి ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ముడి చమురు అవసరాల్లో 90 శాతం దిగుమతులపైనే ఆధారపడే దేశంగా మనం చమురు దిగుమతి దేశాల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాం. హార్మూజ్‌ను కాదని, ఎర్ర సముద్రంవైపునుంచి దిగుమతి చేసుకుందామనుకున్నా యుద్ధ భీతితో ఇన్సూరెన్సు సంస్థలు నౌకల బీమా ప్రీమియంను భారీగా పెంచేశాయి. రవాణా చార్జీలూ అంతే. ఇదంతా ఓఎంసీలకు తడిసిమోపెడవుతున్న మాట వాస్తవమే. ఎవరి మస్తిష్కం ఎలా ప్రకోపిస్తుందో, దాని పర్యవసానాలేమిటో తెలియని వర్తమానంలో మనం దీర్ఘకాలిక వ్యూహాన్ని రూపొందించుకోక తప్పదు. ముడి చమురు, సహజవాయు నిల్వలను పెంచుకోవటం, దిగుమతులకు సంబంధించి ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ, చమురు, సహజవాయు నిక్షేపాల వెలికితీతను పెంచుకునే అవకాశాలు చూడటం ప్రధానం. వీటితోపాటు అర్థరహితమైన ఆంక్షలతో ఇబ్బంది పెడుతున్న అమెరికాను ప్రశ్నించటం కూడా తక్షణావసరం. శరవేగంగా విస్తరిస్తున్న మన ఆర్థిక వ్యవస్థకు చేటుతెచ్చేలావుంటున్న మతిమాలిన హుకుంలు కట్టిపెట్టమని చెప్పటం ముఖ్యం. 'మేం సన్నిహిత మిత్రులం...' అని చెప్పే అమెరికా కబుర్లు ఆచరణలో నిగ్గుతేలేది ఇలాంటపుడే. ఇంధన ధరల పెరుగుదల పాపంలో రాష్ట్రాల వాటా కూడా ఉంది. పెట్రో ధరలవల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యులు విలవిల్లాడుతున్నా విలువ ఆధారిత పన్ను (వ్యాట్) పేరుతో దోపిడీ చేయటం కొన్ని రాష్ట్రాలు ఆపటంలేదు. పర్యవసానంగా చమురు ధర మరింత మండిపోతోంది. ఢిల్లీలో రూ. 99. 51 ఉన్న పెట్రోల్ ఆంధ్ర ప్రదేశ్‌లో రూ.118వరకూ ఉండటంపై బాబు సర్కారు ఏం చెబుతుంది? బీజేపీ సర్కార్లున్నచోట రూ. 114 వరకూ ఉంటే, పొరుగునున్న తమిళనాట రూ. 107.80 ఉంది. మరి ఏపీ ప్రజలు చేసుకున్న పాపం ఏమిటి? ఈ కష్టకాలంలో జనానికి చేతనైతే సాయపడాలి. పనిలో పనిగా దోచుకునే అతి తెలివి కట్టిపెట్టాలి.




# ఆకాశానికి ఇంధన రేట్లు

**పది రోజుల్లో నాలుగుసార్లు పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు**

**రాష్ట్రంలో అత్యధికంగా లీటర్ పెట్రోల్ రూ.118.39, డీజిల్ రూ.106.11**

**తాజాగా లీటరు పెట్రోల్‌పై రూ.2.86, డీజిల్‌పై రూ.2.83 వడ్డన**

**ఫలితంగా వినియోగదారులపై ఏడాదికి రూ.8 వేల కోట్లు భారం.. సగటు సామాన్యుల జీవనంపై తీవ్ర ప్రభావం**

**సామాన్యుడి నడ్డి విరుస్తూ చోద్యం చూస్తున్న చంద్రబాబు సర్కారు**



అమరావతి: రాష్ట్రంలోని వినియోగదారులపై మరోసారి ఇంధన పిడుగు పడింది. గడిచిన పది రోజుల్లో నాలుగుసార్లు పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపుతో సామాన్య, రవాణా రంగం కుదేలవుతోంది. దాదాపు పెట్రోల్‌పై రూ.7.98, డీజిల్‌పై రూ.7.75 పెరగడంతో తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి. రోజులు వ్యవధిలోనే నిత్యం పెరుగుతూ బడుగు జీవుల జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. రాష్ట్రంలో రోజుకు 9 వేల కిలో లీటర్ల పెట్రోల్, 20 వేల కిలోలీటర్ల డీజిల్ వినియోగం కనిపిస్తోంది. ప్రస్తుతం పెరిగిన ఇంధన రేట్లతో సామాన్యులపై ఏడాదికి పెట్రోల్‌పై రూ.2,600 కోట్లు, డీజిల్‌పై రూ.5,400 కోట్లు వెరసి మొత్తం రూ.8వేల కోట్లు భారం మోపుతోంది.

### పది రోజుల్లో నాలుగు సార్లు పెంపు..

రాష్ట్రవ్యాప్తంగా ఇంధన రేట్లు భారీగా పెరగ్గా.. అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లాలో లీటరు పెట్రోల్ రూ.118.39, డీజిల్ రూ.106.11 వరకు ఎగబాకింది. పదిరోజుల కిందట లీటరు పెట్రోల్ రూ.109.74, డీజిల్ రూ.97.47గా ఉంది. ఈ నెలలోనే వరుసగా 15, 19, 24, 25 తేదీల్లో రేట్లు పెంచడంతో దాదాపు డీజిల్, పెట్రోల్‌పై సగటున రూ.8(జిల్లాలను బట్టి రేట్లు మారతాయి) వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది.

### ఫుల్ ట్యాంక్ నిల్..

ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన రేట్లు పైపైకి ఎగబాకుతుంటే మరోవైపు వాహనాలకు ఫుల్ ట్యాంక్‌పై పరిమితులు విధిస్తుండడం కొసమెరుపు. రేట్లు పెంచినప్పుడు దానికి తగ్గట్టుగా ఇంధనం సరఫరా చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైనట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పుడు ఒక లావాదేవీకి కేవలం 200 లీటర్లకు మాత్రమే పరిమితి కొనసాగుతోంది. ఇక్కడ వాణిజ్య వాహనాలు, సరుకు, ప్రజా రవాణా వాహనాలు సగటున 350--400 లీటర్ల కంటే ఎక్కువ ఇంధన ట్యాంక్ సామర్థ్యంతో నడుస్తాయి. కానీ, ప్రభుత్వం 200 లీటర్ల లోపే కట్టడి చేస్తుండడంతో పదేపదే పెట్రోల్ బంకుల వద్ద సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### డీలర్లు నోటీసులా?

200 లీటర్లకు మించి ఇంధనాన్ని ఒకే లావాదేవీలో నింపితే డీలర్లకు ఆయిల్ కంపెనీలు ఆటోమేషన్ సిస్టమ్ ద్వారా నోటీసులు జారీ చేసి, విక్రయాలను నిలిపివేస్తుంటే ప్రభుత్వం వేడుక చూస్తోంది. ఫలితంగా డీలర్లతో పాటు పెట్రోల్ బంకుల్లో పని చేసే సిబ్బంది జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోంది. పైగా ఆస్పత్రులు, ఆక్వా, వ్యవసాయం, బోరువెల్స్ నిర్వహణలో జనరేటర్లు వినియోగించే వారికి అరకొర ఇంధనం అందిస్తే తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇంధన రంగంలో ఇన్ని సమస్యలు ఉన్నా.. చంద్రబాబు ప్రభుత్వం పరిష్కార మార్గాలు చూపకుండా.. ఇష్టారీతిన ఇంధన ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోంది.

# యువత నిరసన




దేశాన్ని షేక్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) విస్ఫోటనం ఇక్కడి యువతలో, ముఖ్యంగా నిరుద్యోగుల్లో గూడుకట్టుకున్న నిరసనాగ్నికి ప్రతిరూపం. కాగా సిజెపి ఎత్తుకున్న సోషల్ మీడియా ఉద్యమం లావాలా ఎగసిపడుతుండటం, తక్కువ సమయంలోనే అత్యధిక ఫాలోవర్లతో సంచలనం కలిగించడం పట్ల కేంద్రంలో పాలక బిజెపికి గంగవెర్రులెత్తుతోంది. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను చంపేస్తామంటూ బెదిరింపులు, ఆ పార్టీ అధికారిక వెబ్‌సైట్ తొలగింపు, ఎక్స్ ఖాతా నిలిపివేత, ఇన్‌స్టాగ్రాం హ్యాకింగ్ వంటివి చకచకా జరిగిపోవడానికి వెనుక కేంద్ర బిజెపి జోక్యం కనిపిస్తుంది. ఒక విద్యార్థి నిర్వహిస్తున్న సోషల్ మీడియా ఉద్యమానికి మోడీ ప్రభుత్వం ఎంతగానో భయపడుతోందని ఈ చర్యలు రూఢి పరుస్తున్నాయి. వ్యక్తిగతంగా నరేంద్ర మోడీ, పార్టీగా బిజెపి సోషల్ మీడియా ద్వారానే అమిత ప్రచారం పొంది అధికారంలోకొచ్చారన్నది జగద్విదితం. విద్వేషాలను ఆ వేదికలుగానే రెచ్చగొట్టాయి. సోషల్ మీడియాను అంతగా ఉపయోగపెట్టుకున్న బిజెపి నిరసనలన్నా, ప్రశ్నించడమన్నా తట్టుకోలేదు. అందుకే సోషల్ మీడియాకు హద్దులు కావాలని కోరుకుంటోంది. అందులో భాగంగా సిజెపి ప్రచారాన్ని అణచివేత, నిర్బంధాలతో నియంత్రిస్తోంది. సిజెపి సోషల్ మీడియా ఖాతాల స్తంభన రాజ్యాంగ విరుద్ధం. ప్రజాస్వామ్య హననం. భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం. అందుకే కేంద్రం చర్యలపై ప్రతిపక్షాలు, హక్కుల కార్యకర్తలు, సోషయల్ మీడియా యాక్టివిస్టులు, యువత నుంచి ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఈ నెల 15న ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా నిరుద్యోగులను బొద్దింకలు (కాక్రోచ్)తో పోల్చుతూ వ్యాఖ్యానించిన 48 గంటల్లో బోస్టన్‌లో చదువుతున్న అభిజీత్ సిజెపి పేరిట సోషల్ మీడియా వేదికగా సెటైరికల్ (వ్యంగ్య) పోస్టులతో ఉద్యమం లేవదీశారు. నిరుద్యోగం, ప్రభుత్వాల విధానాల లక్ష్యంగా ప్రచారం సాగిస్తున్నారు. ధనవంతులు, కుటుంబ నేపథ్యం, విద్రోహ ప్రసంగాలను నిరసించారు. కొన్ని రోజుల్లోనే ఆ ఉద్యమానికి దేశంలోని యువత లక్షల్లో ఆకర్షితులయ్యారు. సిజెపి ఇన్‌స్టాలో ఫాలోవర్ల సంఖ్య వారం రోజుల్లోనే రెండు కోట్లకు చేరడాన్ని బట్టి యువతలో, నిరుద్యోగుల్లో అసంతృప్తి, నిరసన, ఆగ్రహం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. బెంబేలెత్తిన మోడీ ప్రభుత్వం సిజెపి ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. తనకు ఇష్టం లేని వారిపై జాతి వ్యతిరేకులుగా పాకిస్తాన్, చైనా ఏజెంట్లుగా ముద్ర వేయడం బిజెపి, పరివారానికి అలవాటే. సిజెపిపైనా అదే అస్త్రం ప్రయోగించారు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు. సిజెపిపైనా, అభిజీత్‌పై పాక్ ముద్ర వేశారు. ఆ పార్టీ ఫాలోవర్లు పాకిస్తాన్, బంగ్లాదేశ్ వారుగా హిందూ మతోన్మాద పడిగట్టు పదాలతో వాక్చాపల్యానికి పోయారు. దానికి అభిజిత్ ఆధారాలతో సహా తిప్పికొట్టారు. తన ఫాలోవర్లలో 94 శాతం ఇండియా వారేనని భౌగోళిక సమాచారాన్ని వెల్లడించి బిజెపి ప్రభుత్వానికి కంగు తినిపించారు. అయినాసరే, నిరసన గొంతు నొక్కేందుకే బిజెపి సర్కార్ ఉపక్రమించడం ద్వారా ప్రజాస్వామిక హక్కులను కాలరాసేందుకే నిర్ణయించుకోవడం ఆందోళనకరం. బిజెపి పుష్కరకాల ఏలుబడిలో నిరుద్యోగం ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు బద్దలు కొడుతోంది. అధికారంలోకి రాకముందు మోడీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని హామీ ఇచ్చి మాట తప్పారు. మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్ వంటివి నిరుద్యోగులను వెక్కిరిస్తున్నాయి. ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఎఫ్‌డిఐలు, పెట్టుబడులు కార్పొరేట్లకే లాభిస్తున్నాయి. వాళ్ల కోసమే లేబర్ కోడ్లు. ప్రభుత్వరంగంలో కొత్త రిక్రూట్‌మెంట్‌లు లేవు. డిజిల్ పేరిట ఉద్యోగాలు రద్దవుతున్నాయి. అవినీతి, నీట్ పరీక్ష పేపర్ లీకేజీల వంటివి సరేసరి. ఈ విధానాలపై యువతలో, నిరుద్యోగుల్లో అసహనం తీవ్రమవుతోంది. సిజెపి రేపిన సంచలనం సారాంశం ఇదే.

# బ్లాక్ శారీలో సన్నని న డుము.. అందాల జ్యోతి స్టన్నింగ్ లుక్



**గ్లామర్ వరల్డ్ లో ఎంతోమంది అప్సరసల నడుమ పోటీని తట్టుకోవడం అంత చిన్న విషయం కాదు.**

గ్లామర్ వరల్డ్ లో ఎంతోమంది అప్సరసల నడుమ పోటీని తట్టుకోవడం అంత చిన్న విషయం కాదు. ఇక వారిలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జ్యోతి పూర్వాజ్, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. బ్లాక్ ట్రాన్స్‌పరెంట్ శారీలో ఆమె కనిపిస్తున్న తీరు చూస్తుంటే, ట్రెడిషనల్ వేర్‌లో కూడా గ్లామర్‌ను ఎలా ఎలివేట్ చేయాలో ఆమెకు బాగా తెలుసనిపిస్తోంది. అతిగా చేయకుండా, కేవలం తన చూపులతోనే కుర్రకారును ఆకట్టుకుంటోంది. ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోల్లో జ్యోతి తన నేచురల్ బ్యూటీని చాలా చక్కగా ప్రజెంట్ చేసింది. విరబోసిన జుట్టు, సింపుల్ మేకప్, మెడపై ఉన్న చిన్న టాటూ ఆమె లుక్‌కు ఒక మోడ్రన్ టచ్ ఇచ్చాయి. ముఖ్యంగా కెమెరా వైపు చూస్తూ ఆమె ఇస్తున్న స్టైల్ ఫోటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. నేటి జనరేషన్ ఫ్యాషన్ ట్రెండ్స్‌ను ఫాలో అవుతూనే, శారీ కట్టులో ఉండే ఆ హుందాతనాన్ని ఎక్కడా తగ్గకుండా చూసుకుంది. డీసెంట్ అప్పీల్‌తోనే గ్లామర్ డోస్ పెంచవచ్చని ఈ క్లిక్స్‌తో నిరూపించింది. జ్యోతి పూర్వాజ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె ప్రయాణం చాలా బలన్స్ గా సాగుతోంది.



బుల్లితెరపై నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత వెండితెరపై కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనతో ఆడియన్స్‌ను అలరిస్తోంది. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలు చేయడానికే ఆమె ప్రాధాన్యత ఇస్తోంది దస్ట్రీలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, తనకంటూ ఒక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకోవడంలో ఆమె సక్సెస్ అయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో జ్యోతికి మిలియన్ల కొద్దీ ఫాలోయింగ్ ఉంది. ఆమె షేర్ చేసే ప్రతి ఫోటో కూడా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. నటిగానే కాకుండా ఒక ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా ఆమె ఎదుగుతోంది. ఫిట్‌నెస్ విషయంలో ఆమె తీసుకుంటున్న జాగ్రత్తలు ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన లుక్స్‌తో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్‌ను థ్రిల్ చేస్తోంది. ముఖ్యంగా యువతలో ఆమెకు ఉన్న క్రేజ్ ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. మరి అమ్మడు ఈ గ్లామర్ తో ఎలాంటి ఆఫర్లు అందుకుంటుందో చూడాలి.


# ఆ బయోపిక్ లో సాయి పల్లవి తప్ప మరో ఆప్షనే లేదట!



భారతీయ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన గాన కోకిల ఎం.ఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌పై ఇండస్ట్రీలో మళ్లీ చర్చలు వేడెక్కుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా సాయి పల్లవిని ఫైనల్ చేసినట్టు వస్తున్న సమాచారం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మధ్యలో పలు పేర్లు వినిపించినప్పటికీ, మేకర్స్ మాత్రం సాయి పల్లవిని తప్ప మరెవరినీ ఈ పాత్ర కోసం పరిగణనలోకి తీసుకోవడంలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా నిర్మించనున్నారని సమాచారం. ఇటీవల ఈ బయోపిక్ నుంచి సాయి పల్లవి తప్పుకుందనే వార్తలు, అలాగే ఆమె స్థానంలో రుక్మిణి వసంత్‌ను తీసుకున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఈ వార్తలన్నింటినీ మేకర్స్ పూర్తిగా ఖండించినట్టు తెలుస్తోంది. ఎం.ఎస్ సుబ్బులక్ష్మి లాంటి గొప్ప వ్యక్తిత్వాన్ని తెరపై ప్రతిబింబించాలంటే సాయి పల్లవి లాంటి నటి అవసరమని టీమ్ గట్టిగా నమ్ముతోందట. ఆమె నటనలో ఉన్న సహజత్వం, క్లాసికల్ లుక్, డెడికేషన్ లాంటి క్వాలిటీస్ ఆమెను ప్రత్యేకంగా నిలబెడతాయని భావిస్తున్నారు. అందుకే ఈ ప్రాజెక్ట్‌లో ఆమెనే కొనసాగిస్తున్నామని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. మొదట ఈ సినిమా త్వరగా స్టార్ట్ అవుతుందని భావించినప్పటికీ, సాయి పల్లవి ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల షూటింగ్ షెడ్యూల్‌ను వాయిదా వేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో, ఈ పాత్ర కోసం సాయి పల్లవి ప్రత్యేకంగా కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంటోందన్న సమాచారం కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది

ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. మొదట ఈ సినిమా త్వరగా స్టార్ట్ అవుతుందని భావించినప్పటికీ, సాయి పల్లవి ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల షూటింగ్ షెడ్యూల్‌ను వాయిదా వేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కోసం సాయి పల్లవి ప్రత్యేకంగా కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంటోందన్న సమాచారం

కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌ను తెరకెక్కించనుండటం ఈ ప్రాజెక్ట్‌కు మరో బలంగా మారింది. జెర్సీ వంటి భావోద్వేగభరితమైన సినిమాతో తన కథన శైలిని నిరూపించుకున్న ఆయన, ఎం.ఎస్ సుబ్బులక్ష్మి జీవితాన్ని కూడా అదే స్థాయిలో ఎమోషనల్ గా, నిజాయితీగా చూపిస్తాడనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంది. ఇక సంగీత దర్శకుడు అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందించనుండటం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఒక గొప్ప సంగీత విద్వాంసురాలి జీవితం నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా కావడంతో మ్యూజిక్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషించనుంది. మొత్తానికి, సాయి పల్లవి లాంటి ప్రతిభావంతమైన నటి ఈ బయోపిక్‌లో ప్రధాన పాత్ర పోషించడం, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం, అనిరుధ్ సంగీతం ఇవన్నీ కలిసివచ్చి ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ఆసక్తికరంగా మార్చుతున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, త్వరలోనే మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# వారణాసి తర్వాత మహేష్ ప్లాన్ అదే!



**ఇదిలా ఉంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ప్లాన్స్ మరింత యాంబీషస్‌గా కనిపిస్తున్నాయి.**

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్‌లో కీలక మలుపు తిరిగే ప్రాజెక్ట్‌గా వారణాసి నిలవబోతోందనే అంచనాలు ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పూర్తి స్థాయి పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేయని మహేష్, ఈ సినిమాతో తన ఇమేజ్‌ను నేషనల్ నుంచి గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లాలని చూస్తున్నారు. ముఖ్యంగా రాజమౌళి దర్శకత్వం ఈ ప్రాజెక్ట్‌కు భారీ క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది. రాజమౌళి సినిమాలకు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు దృష్ట్యా, వారణాసి మహేష్ బాబుకు కేవలం సినిమా కాకుండా ఒక కెరీర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్‌గా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్టార్ హీరో సంచలన నిర్ణయం! గుంటూరు కారం తర్వాత మూడేళ్ల గ్యాప్ అయితే ఈ జర్నీలో మహేష్ కెరీర్లో మూడేళ్ల గ్యాప్ వచ్చింది. గుంటూరు కారం తర్వాత మహేష్ నుంచి ఇంత పెద్ద గ్యాప్ తీసుకోవడం రిస్క్‌గా కనిపించినా, తర్వాత వస్తుంది రాజమౌళి సినిమా కాబట్టి అది తన మార్కెట్ ను, క్రేజ్ ను, ఫాలోయింగ్ ను పెంచుతుందే తప్పించి ఏ మాత్రం రిస్క్ అనుకోవడానికి లేదు. రాజమౌళి ప్రాజెక్ట్స్‌కు సహజంగానే ఎక్కువ సమయం పడుతుండటంతో, ఈ గ్యాప్‌ను ఫ్యాన్స్ కూడా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, సినిమా రిలీజ్ అయ్యే సమయానికి ఈ వెయిటింగ్ పీరియడ్ మరింత ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచే ఫ్యాక్టర్‌గా మారవచ్చు. ాాఁజవతీఅంవఎవత్ మూడేళ్లలో మూడు సినిమాలు ఇదిలా ఉంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ప్లాన్స్ మరింత యాంబీషస్‌గా కనిపిస్తున్నాయి. మూడేళ్లలో మూడు సినిమాలు రిలీజ్ చేయాలనే టార్గెట్ తో ఆయన ముందుకెళ్తున్నట్టు టాక్. ఇది కేవలం బిజీ షెడ్యూల్ మాత్రమే కాకుండా, మార్కెట్‌ను నిరంతరం యాక్టివ్‌గా ఉంచే వ్యూహంగా భావిస్తున్నారు. వారణాసి తర్వాత మహేష్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఓ ప్రాజెక్ట్, అలాగే ఏషియన్ సునీల్ తో మరో సినిమా చర్చల్లో ఉండటం గమనార్హం. ఒకేసారి పలు ప్రాజెక్టులను ప్లాన్ చేయడం ద్వారా గ్యాప్‌లను తగ్గించడమే కాకుండా, విభిన్న జానర్లతో ఆడియన్స్‌ను ఆకట్టుకోవాలని మహేష్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ప్రాజెక్టులకు ఎవరు దర్శకత్వం వహిస్తారనేది ఇంకా ఫైనల్ కాకపోవడం ఆసక్తిని పెంచుతోంది. - రూ.3000 కోట్ల డైరెక్టర్‌పై కన్నేసిన టాలీవుడ్ హీరో  డిమాండ్ ఇక రెమ్యునరేషన్ అంశం కూడా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. వారణాసి తర్వాత పెరిగే మార్కెట్ ను దృష్టిలో ఉంచుకుని ఆయన భారీ పారితోషికం డిమాండ్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. వారణాసి సక్సెస్ అయితే, ఆయన మార్కెట్ విలువ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో, ఈ హైక్ నిర్మాతలపై బడ్జెట్ ప్రెజర్‌ను పెంచే అవకాశముంది. ఇదే సమయంలో, స్టార్ మార్కెట్ పెరిగితే రికవరీ కూడా అదే స్థాయిలో ఉండే అవకాశం ఉండటంతో, నిర్మాతలు కూడా ఈ రిస్క్‌ను అంగీకరించడానికి అవకాశాలున్నాయి. . ఒక్కసారే భోజనం అయితే ఈ మొత్తం ప్లాన్‌లో అత్యంత కీలకమైంది రాజమౌళితో సినిమా చేసిన తర్వాత వచ్చే ప్రాజెక్టులపై భారీ అంచనాలు ఏర్పడటం సహజం. గతంలో పలువురు స్టార్ హీరోలు ఈ ప్రెజర్‌ను ఫేస్ చేసినప్పటికీ, వాళ్లలో ఎక్కువ మంది ఫ్లాపులనే ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహేష్ తర్వాతి ప్రాజెక్టులు, వాటి ఎంపికపై మరింత జాగ్రత్త వహించాల్సిన అవసరముందని అంతా అభిప్రాయపడుతున్నారు. మరో వైపు మార్కెట్ ఎక్స్‌పాన్షన్ విషయంలో కూడా మహేష్ బాబు స్పష్టమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్టు తెలుస్తోంది. వారణాసి తర్వాత నార్త్ ఇండియా మరియు ఓవర్సీస్ మార్కెట్లపై ఫోకస్ పెంచే అవకాశం ఉంది. రాజమౌళి బ్రాండ్ వల్ల వచ్చే విజిబిలిటీని ఉపయోగించుకుని, తన తర్వాతి సినిమాలను కూడా పాన్ ఇండియా లెవల్‌లో ప్లాన్ చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా చూస్తే, వారణాసి మహేష్ బాబు కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవడమే కాకుండా, ఆయన భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక ప్రాజెక్ట్‌గా మారనుంది.


# ‘మైసా’ కోసం రష్మిక రిస్క్.. 80 అడుగుల ఎత్తు నుంచి జంప్




పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న ‘మైసా’ కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి ‘మైసా’ డైరెక్టర్ రవీంద్ర పుల్లె  తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. “రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు ‘మైసా’. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయింది” అని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



# అల్లరి నరేష్ ఫిట్‌నెస్ సీక్రెట్.. ఒక్కసారే భోజనం



**టాలీవుడ్ సీనియర్ హీరో అల్లరి నరేష్ తన కామెడీతోనే కాదు, తన లీన్ ఫిజిక్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు.**

టాలీవుడ్ సీనియర్ హీరో అల్లరి నరేష్ తన కామెడీతోనే కాదు, తన లీన్ ఫిజిక్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు. ఇన్నేళ్లయినా ఆయన బాడీ షేప్ ఏమాత్రం మారకపోవడం వెనుక ఒక కఠినమైన డైట్ ప్లాన్ ఉంది. రోజుకు కేవలం ఒక్క పూట మాత్రమే భోజనం చేసే పద్ధతిని ఆయన పాటిస్తున్నారు. ఆహారంపై పెద్దగా ఆకర్షణ లేకపోవడమే తన ఫిట్‌నెస్ రహస్యమని, లీన్ బాడీని మెయింటైన్ చేయడం కోసమే ఈ క్రమశిక్షణతో ఉన్నానని ఆయన వెల్లడించారు. ఆ వివరాలు చూద్దాం.. స్టార్ హీరో సంచలన నిర్ణయం! రోజుకు ఒక్క పూటే భోజనం: అల్లరి నరేష్ ఫిట్‌నెస్ విషయంలో చాలా స్ట్రిక్ట్. ఆయన రోజుకు ఒకేసారి హుందాగా భోజనం చేస్తారు. అంటే మధ్యాహ్నం లంచ్ చేస్తే, రాత్రి డిన్నర్ చేయరు. ఒకవేళ రాత్రికి ప్లాన్ ఉంటే మధ్యాహ్నం స్కిప్ చేస్తారు. ఇలా చేయడం వల్ల బాడీలో అనవసరమైన ఫ్యాట్ చేరకుండా ఉంటుందని ఆయన నమ్ముతారు. దాదాపు 90 శాతం సమయం ఆయన ఇదే పద్ధతిని ఫాలో అవుతూ తన బరువును అదుపులో ఉంచుకుంటారు. జ్యూస్‌లకు, కొబ్బరి నీళ్లకు దూరం చాలామంది ఫిట్‌నెస్ కోసం జ్యూస్‌లు, కొబ్బరి నీళ్లు వంటివి ఎక్కువగా తీసుకుంటుంటారు. కానీ నరేష్ మాత్రం వీటికి దూరంగా ఉంటారట. ఆయనకు ఆహారం పట్ల అంతగా క్రేజ్ లేకపోవడం కూడా ఒక ప్లస్ పాయింట్ అని చెప్పాలి. కేవలం తనకు అవసరమైన పోషకాలు అందేలా ఒకే పూట తింటూ, మిగతా సమయమంతా చాలా తక్కువ క్యాలరీలతో సరిపెట్టుకుంటారు. దీనివల్ల ఆయన ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. వర్కౌట్స్ అంటే ఇలా ఉండాలి: కేవలం డైట్ మాత్రమే కాదు, వర్కౌట్స్ విషయంలోనూ నరేష్ తనదైన స్టైల్ ఫాలో అవుతారు. సిక్స్ ప్యాక్ లేదా పర్ఫెక్ట్ బాడీ షేప్ కోసం ర్యాంకింగ్ లెగ్ రైజెస్, బ్యాక్ ఎక్స్‌టెన్షన్స్ వంటి వ్యాయామాలు చేస్తారు. కండలు పెంచి బాడీని బల్క్ చేయకుండా, ఎప్పుడూ లీన్ గా ఉండటానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు. అందుకే ఆయన ఏ రోల్‌లో నటించినా ఆ పాత్రకు త్వరగా సెట్ అయిపోతారు. వరుస సినిమాలతో బిజీ: నరేష్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో “కనక దుర్గ” అనే డివోషనల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. ఇది కాకుండా, మే 29న “ఆల్కహాల్” అనే సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. ఇందులో రుహానీ శర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఒక నటుడిగా నిలదొక్కుకోవాలంటే టాలెంట్‌తో పాటు ఫిట్‌నెస్ కూడా చాలా ముఖ్యం. అల్లరి నరేష్ పాటిస్తున్న ఈ ‘వన్ మీల్ ఏ డే’ పద్ధతి అందరికీ సాధ్యం కాకపోయినా, ఆయన చూపిస్తున్న క్రమశిక్షణ మాత్రం అభినందనీయం. కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూనే, తన హెల్త్ విషయంలో ఇంత కేర్ తీసుకోవడం వల్లే ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అదరగొడుతున్నారు. ఇక మరి ఆయన రాబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటాయో చూడాలి!

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .